RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



22 జనవరి 2025 బుధవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:198

## ఉత్తేజకరమైన, పెట్టుబడులకు ఆశాజనకమైన కార్యక్రమాలకు శ్రీకారం







దావోస్‌లోని తెలంగాణ పెవీలియన్‌లో సందడి నెలకొంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 55 వ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణ పెవీలియన్ ప్రారంభించిన తర్వాత కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

తెలంగాణ రైజింగ్ నినాదంతో రెండో రోజు అనేక ఉత్తేజకరమైన, పెట్టుబడులకు ఆశాజనకమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ శ్రీధర్ బాబు తో కలిసి తెలంగాణ పెవీలియన్‌లో యునిలివర్ ఇన్‌కార్పొరేషన్ (భారత్‌లో హిందుస్తాన్ లీవర్) గ్లోబల్ సీఈవో హెయిన్ షూమేకర్ సమావేశం కానున్నారు.

అలాగే గ్లోబల్ పబ్లిక్ పాలసీ, అమెజాన్ వెబ్ సర్వీసెస్ , సిఫీ టెక్నాలజీస్ , స్కైరూట్ ఎయిరోస్పేస్ , ఎజిలిటీ , యూపీఎల్ వంటి అగ్రశ్రేణి సంస్థల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశాలు, చర్చలు ప్రారంభం కానున్నాయి.

అనంతరం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సారధ్యంలో వివిధ కంపెనీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు.

ప్రధానంగా ఐటీ, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ టీమ్ చర్చలు జరుపనుంది.

## మంగళవారం నాడు ఉదంఖటోలాలో హరిద్వార్ మా చండీదేవి దర్శనానికి వెళ్తున్న జగద్గురు కల్కి భగవాన్, డా.భగవంత్ రావు.



మంగళవారం నాడు జనవరి 20, 2025న ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో రాష్ట్రీయ హిందూ వాహిని సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జగద్గురు సామ్రాట్ భగవాన్ శ్రీ కల్కి మహారాజ్ రాజదండం, గొడుగు మరియు చౌవారితో పాటు అనేక అఖారాలకు చెందిన ఋషులు మరియు సాధువులతో పాటు, డాక్టర్ భగవంతరావు, అదే సంస్థ జాతీయ మంత్రి మరియు హైదరాబాద్ బిజెపి నాయకుడు, డెహ్రాడూన్ మేయర్ శ్రీ సునీల్ ఉనియాల్, సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్రీ రాజు భయ్యా, జాతీయ ఇంచార్జి శ్రీ కృష్ణ కిషోర్ కడప మరియు ఇతర అధికారులు, ఈ కార్యక్రమం తరువాత, కల్కి స్వామితో గంగాస్నానం చేసి, అందరూ ఉత్తరప్రదేశ్‌లోని హరిద్వార్‌లోని సంభాల్ కల్కి ఆలయానికి బయలుదేరారు.









పెట్టుబడులను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో అత్యంత కీలకమైన సమావేశాలకు సర్వసన్నద్ధమైంది. సప్లయ్ చైన్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఇన్నొవేషన్ రంగాల్లో ప్రఖ్యాత కంపెనీ ఎజిలిటీ వైఎస్ చైర్మన్ తారెక్ సుల్తాన్ గారితో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గారు భేటీ అయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు రైతుల ఆదాయాన్ని స్థిరంగా పెంచేందుకు ఇస్తున్న ప్రాధాన్యతలను మంత్రి శ్రీధర్ బాబు గారు ఈ సమావేశంలో వివరించారు.

# ఛత్తీస్గఢ్‌లో భారీ ఎన్కౌంటర్..

### 14 మంది నక్సలైట్లు మృతి

### మృతుల్లో ఇద్దరు మహిళా మవోయిస్టులు







నౌపాడ (ఒడిషా) ఛత్తీస్గఢ్, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. ఛత్తీస్ ఘడ్, ఒడిషా రాష్ట్రాల సరిహద్దుల్లోని కులరిఘాట్ ఆడవిలో మావోయిస్టుల సంచారం పై పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఇరు రాష్ట్రాల బలగాలు, సీఆర్పిపిఎఫ్ దళాలు నౌపాడ, గరియాగంజ్ ఆటవీ ప్రాంతాల్లో కుంబింగ్ ప్రారంభించాయి. సోమవారం నాడు ఇద్దరు మహిళా మావోయిస్టులు పోలీసుల ఎదురు కాల్పుల్లో హతమయ్యారు. అక్కడే భారీ ఎత్తున ఆయుధాలు, ఐఈడీలు స్వాధీనం చేసుకున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్న తరుణంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులకు మావోయిస్టులు తరసపడ్డారు. అప్పుడు జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది నక్సలైట్లు మృతి చెందారు. మృతుల సంఖ్య పెరగవచ్చని సమాచారం. ఈ నెల లో ఇప్పటివరకు చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు.

# ప్రజాబలం

22 జనవరి 2025 బుధవారం


## విశాఖ ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనమే!

కేంద్ర ప్రభుత్వ "క్యానెబిట్ కమిటీ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్" (సి.సి.ఇ.ఎ) ప్రధాన మంత్రి మోడీ అధ్యక్షతన జనవరి 17న జరిగిన సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ రివైవల్ ప్యాకేజీ కోసం రూ.11,440 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది. ఎన్‌డిఎ ప్రభుత్వం 6 నెలలు కష్టపడి ఉక్కు సంకల్పంతో సాధించిన ఘన విజయంగా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వ అధినేతలు ప్రకటించారు. విశాఖ స్టీల్‌ను 100 శాతం ప్రైవేటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సుమారు గత నాలుగు సంవత్సరాల కాలంలో.. రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మిక వర్గం నిరంతర పోరాట ఫలితంగానే ఈ ప్యాకేజీ సాధ్యమైంది. స్టీల్ కార్మికులు, ప్రజలు పోరాడి సాధించుకున్న ప్యాకేజీ ఇది. ఈ ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం దేనికి ఖర్చు పెడుతుందో ముందు ముందు చూడాలి. అయితే ఈ ప్యాకేజీ విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఈ ప్యాకేజీని అందరూ ఆహ్వానిస్తున్నారు. అయితే ప్లాంటుకు ముఖ్యం స్వంత గనులు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.11,440 కోట్లలో రూ.1140 కోట్లు షేర్ ధనానికి అసలు, వడ్డీతో సహా కేంద్ర ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలి. ఈక్విటీగా కేటాయించిన రూ.10,300 కోట్లలో ఇప్పటికే రూ.1200 కోట్లు విశాఖ స్టీల్‌కు వినియోగించారు. కార్మికుల పి.ఎఫ్, జీతాలకు ఇందులో రూ. 1000 కోట్ల బకాయిలు చెల్లించాలి. 2025 ఆగస్టు నాటికి మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపి పూర్తి సామర్థ్యం సాలీనా 73 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి ఉత్పత్తి సాధించడానికి సాలీనా రూ.18 వేల కోట్లు ముడి ఖనిజాలకు ఇప్పటి రేట్ల ప్రకారం ఖర్చు అవుతుంది. రెండు సంవత్సరాలలోనైనా 100 శాతం సామర్థ్యం సాధించడానికి ఇప్పుడు కేటాయించిన నిధులు ఏ మూలకూ సరిపోవు. కేవలం 7 లక్షల టన్నుల సామర్థ్యం వున్న కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్‌కు రూ.18 వేల కోట్లు కేంద్రం కేటాయించింది. ఇద్దరు ఎంపీలతో కర్ణాటక రూ.18 వేల కోట్లు సాధించినా అక్కడ ఇంత ఆర్భాటం చేయలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో గొప్పగా ప్రచారం చేయడం సంకీర్ణ ప్రభుత్వ ఘనత. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలని నిర్ణయించిన 2021-22 సంవత్సరంలో కూడా విశాఖ స్టీల్ రూ.913 కోట్లు నికర లాభాలార్జించింది. రూ.28,215 కోట్లు అత్యధికంగా టర్నోవర్ పొందింది. గత మూడు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వం, అదాని పోర్టులు ఉత్పత్తిని అడ్డుకుని విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టాయి. విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి నిజాయితీతో కేంద్ర ప్రభుత్వం నిలబడితే ఈ నష్టాలు విశాఖ స్టీల్‌కు లెక్కలోకి రావు. 1991 నుంచి కేంద్ర ప్రభుత్వం ఒక్క కోటి రూపాయలు కూడా విశాఖ స్టీల్‌కు కేటాయించక పోయినా స్వంత లాభాలతో రూ. 22 వేల కోట్లు వెచ్చించి 73 లక్షల టన్నుల సామర్థ్యానికి చేరింది. భారీ స్టీల్ ప్లాంట్లకు ముడి ఖనిజమే ప్రధాన పెట్టుబడి. ముడి ఖనిజాల్లో ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ ప్రధానమైనవి. 2000 సంవత్సరం నుంచి ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2000 సంవత్సరంలో మార్కెట్‌లో టన్ను ఇనుప ఖనిజం రూ. 500 ఉంటే నేడు టన్ను 6000 నుండి 8000 రూపాయల వరకు ఎగబాకింది. కోకింగ్ కోల్ మన దేశంలో లభ్యం కాదు. విదేశాల నుండి దిగుమతి చేసుకుంటాం. 2018లో 48 డాలర్లు ఉన్న కోకింగ్ కోల్ ధర నేడు టన్ను 240 డాలర్లకు పెరిగింది. ప్రపంచంలో పుష్కలంగా ఇనుప ఖనిజం లభించే దేశాలలో భారతదేశం ఒకటి. కేంద్ర ప్రభుత్వం మన దేశంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్లకు ఇనుప ఖనిజం 100 సంవత్సరాలకు సరిపడా కేటాయించింది. టాటా, భిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా వంటి స్టీల్ ప్లాంట్లు అన్నింటికీ ముడి ఖనిజం సమృద్ధిగా వుంది. వారితో విశాఖ స్టీల్ పోటీ పడాలి. మార్కెట్‌లో అన్ని స్టీల్‌ప్లాంట్ల అమ్మకాల రేట్లు ఒక్కటే. మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ చట్టం 1957 సెక్షన్ 17(1)(బి) ప్రకారం ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటికి ముడి ఖనిజం గనులు కేటాయించాలని ముడి ఖనిజం గనుల చట్టంలో స్పష్టంగా వుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు స్వంత గనుల కేటాయింపు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణ సమయంలో 1985లో విడుదల చేసిన డి.పి.ఆర్ ప్రకారం ఎన్.ఎమ్.డి.సి (నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్), బైలదిలా లోని నాలుగు, ఐదు బ్లాకుల్లో స్వంత గనులు విశాఖ స్టీల్‌కు కేటాయించాలి. ప్రభుత్వ రంగంలో 1990లో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కావాలనే, ప్రైవేటు చేయడానికే కేంద్ర ప్రభుత్వాలు స్వంత గనులు కేటాయించలేదు. స్వంత గనులు కేటాయిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ బలపడుతుంది. స్టీల్ రంగంలో విశాఖ స్టీల్ తిరుగులేని శక్తిగా ఎదుగుతుంది. పాలకులు వారి ఇష్టం వచ్చిన ప్రైవేటు కంపెనీలకు విశాఖ స్టీల్‌ను కారుచౌకగా కట్టబెట్టాలనే దురుద్దేశంతోనే విశాఖ స్టీల్‌కు నేటికీ స్వంత గనులు కేటాయించడానికి నిరాకరిస్తున్నారు. కనీసం స్టీల్ అధారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విలీనం చేయాలన్న కార్మికుల డిమాండ్‌ను బి.జె.పి పాలకులు ఖాతరు చేయడంలేదు. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోకెల్లా సముద్ర తీరంలో 20 వేల ఎకరాల స్వంత భూములలో ఏర్పడిన ఏకైక భారీ స్టీల్ ప్లాంట్. నవరత్న గుర్తింపు పొందిన ఏకైక స్టీల్ ప్లాంట్ కూడా ఇదే. బంగారు బాతు లాంటి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాజేయడానికి కార్పొరేట్లు పోటీ పడుతున్నారు. వాటిని ప్రతిఘటించి విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా విశాల ఐక్య ఉద్యమం సాగించాలి. కార్మికుల పోరాటం, ప్రజల సంఘీభావం పరిఢవిల్లాలి.

## మొర్జంపాడు లో లక్ష్మీ నరసింహ స్వామి తిరుణాలు

### ఫిబ్రవరి 6, 7 తేదీలలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

మాచవరం, మాచవరం మండలం మొర్జంపాడు శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఫిబ్రవరి 7వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి హంసా వత్ రామా నాయక్ స్వామి తెలిపారు. ఫిబ్రవరి6 న స్వామి వారి సేవా కార్యక్రమం జరుగుతుందన్నారు. కల్యాణ వేడుకలు సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు, మరియు పలు సాంఘిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

## కదిరి నరసింహస్వామిని దర్శించుకున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు

కదిరి పట్టణంలో వెలసిన శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామిని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాతు హుస్సేన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతు హుస్సేన్ కు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి, నగరపాలక సంస్థ పరిధిలోని ఎస్.టి.వి.నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను మంగళవారం ఉదయం ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు కార్పొరేటర్ ఆంజనేయులు తో కలసి పరిశీలించారు. ప్రధాన దారులతో పాటు, సందుల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించగా మురుగు కాలువలు పొడై , చెత్త నిల్వ ఉండడంతో సంబంధిత అధికారులను మందలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన వీధులే కాకుండా చిన్నచిన్న వీధుల్లో కూడా మురుగునీటి కాలువలు, రోడ్లు శుభ్రంగా ఉంచాలని అన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయాలని అన్నారు. మురుగునీటి కాలువలు, రోడ్ల మరమ్మత్తులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలు, దుకాణదారులు పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మీ ఇంటి వద్దకు వచ్చే తమ సిబ్బందికి చెత్త ఇచ్చి సహకరించాలని కమిషనర్ ప్రజలను కోరారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లలిత, డి.సి.పి. మహాపాత్ర, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

# కొన ఊపిరితో నక్సలిజం

**దీంతో నక్సల్స్ లేని భారత్ :కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా**

**- - ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో 1000 మందితో భారీ ఎన్?కౌంటర్?- కీలక మావో నేతలు హతం**

**ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జనవరి 21(భారత్ సమాచార్)వెయ్యి మంది భద్రతా సిబ్బంది మావోల కోసం మూడు రోజులుగా వేట,20 మంది నక్సలైట్లు మృతి**

**కోటి రివార్డ్ ఉన్న చలపతి హతం**

**నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బన్న**

ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్?కౌంటర్?లో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి! మావోల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాల్లో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా 1000 మందికిపైగా కలిసి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ సక్సెస్ అయింది. 20 మంది మావోయిస్టులు హతమవ్వగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికీ ఏరివేత కొనసాగుతోంది. కీలక నేతలు హతం!ముఖ్యంగా తాజాగా జరిగిన ఎన్?కౌంటర్?లో మావోయిస్టు కీలక నేతలు మృతి చెందడం గమనార్హం. వారిలో నక్సలిజం కేంద్ర కమిటీ సభ్యులు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై గతంలో అలిపిరిలో జరిగిన దాడి కేసులో చలపతి కీలక సూత్రధారి. చిత్తూరు జిల్లా వాసి అయిన అతడిపై రూ.కోటి రివార్డు ఉంది.

### కొన ఊపిరితో నక్సలిజం

దీంతో నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగు పడిందనే చెప్పాలి. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కూడా అదే విషయాన్ని సోషల్ మీడియాలో తెలిపారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని అన్నారు. నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగు పడిందని వ్యాఖ్యానించారు. తాజా ఎన్?కౌంటర్? నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ అని, మన భద్రతా బలగాలకు ఇది గొప్ప విజయంగా అభివర్ణించారు.

నిఘా వర్గాల సమాచారం ఆధారంగా!అయితే ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో నిఘా వర్గాల సమాచారం ఆధారంగా జనవరి 19 రాత్రి నుంచి ప్రత్యేక ఆపరేషన్ జరుగుతోంది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పుడు కూడా ఆపరేషన్ కొనుసాగుతుండడం వల్ల మరింత మావోలు హతమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

2025లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు కాల్పుల్లో ఇప్పటి వరకు నలభై మంది నక్సలైట్లు మరణించారు. జనవరి 16న బీజాపుర్ జిల్లాలో భద్రతా దళాల చేతిలో 12 మంది నక్సలైట్లు హతమయ్యారు. ఆ తర్వాత జనవరి 16న జరిగిన కాల్పుల్లో 18 మంది మరణించారని మావోయిస్టులు అంగీకరించారు. గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో 219 మంది నక్సలైట్లను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. అలా మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలనే కేంద్రం సంకల్పాన్ని బలోపేతం చేస్తూ భద్రతా దళాలు వరుస విజయాలు సాధిస్తున్నాయని చెప్పాలి.

# గౌరిపెద్ది పాండిత్యం యువతకు స్ఫూర్తిదాయకం

### ప్రముఖ శతవధాని భరత్ శర్మ అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా గౌరి పెద్ది రామసుబ్బశర్మ 34వ వర్ధంతి

తిరుపతి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అమూల్యమైన సేవలందించిన గౌరి పెద్ది రామసుబ్బశర్మ వంటి మహానుభావుల జీవితాలను, వారు చేసిన కృషి, వారి జీవనం యువతకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ శతవధాని భరత్ శర్మ చెప్పారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో మంగళవారం గౌరి పెద్ది రామసుబ్బశర్మ 34వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా తిరుపతికి చెందిన భరత్ శర్మ " సాహితీ శిఖరం - శ్రీ గౌరిపెద్ది " అనే అంశంపై ఉపన్యసిస్తూ, రత్నంను గుర్తించాలంటే రత్నంను పరీక్షించడం తెలిసిన వాడై ఉండాలన్నారు. అదేవిధంగా శ్రీవారికి పరమ భక్తుడైన అన్నమాచార్యులవారు గానం చేసిన పద కవితలను విశ్లేషించి, శ్రీవారి భక్తుడైన గౌరిపెద్ది రామసుబ్బశర్మ పరిష్కరించారన్నారు. అన్నమాచార్యులవారు గానం చేసిన సంకీర్తనలను గౌరిపెద్ది వారు స్పష్టంగా తెలియజేశారని వివరించారు.

తిరుపతికి చెందిన ప్రముఖ శతవధాని ఆముదాల మురళి మాట్లాడుతూ, " శ్రీ గౌరిపెద్ది - అన్నమయ్య కీర్తనల పరిష్కరణ " అనే అంశంపై మాట్లాడుతూ, అద్భుతమైన సాహితీ సృజన చేసిన ప్రముఖులలో గౌరి పెద్ది ఒకరని అన్నారు. తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు 27 సంపుటలు పరిష్కరించడంలో గౌరి పెద్ది వారు విశేష కృషి చేశారన్నారు. భారత, భాగవత, పురాణ ఇతిహాసాలను అపూర్వ సాహిత్యంతో అందించిన సంకీర్తనలను గౌరపెద్ది రామసుబ్బశర్మ మనకు అందించారని వివరించారు.అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాల రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరి పెద్ది వెంకట భగవాన్, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, పురప్రజలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ విలువలకు అనుగుణంగా తెలంగాణ శాసనసభ

పాట్నాలో జరుగుతున్న 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ంఎఖూఅ) లో తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, మరియు లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అధికారులు పాల్గోన్నారు

సభలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రాజ్యాంగ ఆవిర్భావం జరిగి 75 వసంతాలు అయిన సందర్భంగా రాజ్యాంగ విలువల బలోపేతానికి పార్లమెంట్, శాసనసభల తోడ్పాటు అంశంపై మాట్లాడారు.

భారత రాజ్యాంగాన్ని అనుసరించి పార్లమెంట్ రూపొందించిన చట్టాలు దేశంలో ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడుతున్నాయి. తద్వారా దేశ ప్రజల హక్కులు రక్షించబడుతున్నాయి. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం, వస్తు సేవల పన్ను లతో పాటుగా విద్య, వైద్యం, సామాజిక న్యాయం వంటి అంశాలలో పార్లమెంట్ రూపొందించిన చట్టాలు ఈ దేశ పౌరులకు ఉపయోగపడుతున్నాయి.

ప్రజాస్వామ్యం, సమన్యాయం, సమానత్వం లు ప్రాథమిక అంశాలుగా రూపొందించిన భారతదేశ రాజ్యాంగం గత డెబ్బై అయిదు సంవత్సరాలుగా ఈ దేశ ప్రజలకు మార్గదర్శనం చేస్తున్నదని అన్నారు.

భారత రాజ్యాంగ విలువలకు, మార్గదర్శకాలకు అనుగుణంగా తెలంగాణ శాసనసభ పనిచేస్తుంది. తెలంగాణ ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనలో, వాటిని చట్టాలుగా ఆమోదించడంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఒక మోడల్ గా ఉన్నది.మెజారిటీ ప్రజలకు సంబంధించిన వ్యవసాయం, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, సామాజిక పథకాలు, మౌళిక వసతుల కల్పన వంటి కీలక అంశాలకు తెలంగాణ శాసనసభ ప్రాముఖ్యత ఇచ్చిందని అన్నారు.

ముఖ్యంగా రైతుల భూ వివరాలకు ఉపయోగపడే భూ భారతి చట్టం, యువతకు సంబంధించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి చట్టాల రూపకల్పన ద్వారా తెలంగాణ శాసనసభ మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నదని సగర్వంగా చెప్పగలను.రాష్ట్ర జనాభాలో మెజారిటీగా ఉన్న రైతుల ప్రయోజనం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తుంది. రైతు భరోసా పెంపు, రైతు భీమా అమలు ద్వారా రైతాంగానికి అండగా ఉన్నది. ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని ప్రభుత్వం మెస్ చార్జీలను భారీగా పెంచింది. విద్యార్థులకు అందుతున్న సేవలను పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు తరుచుగా గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్నారు. మహిళలను గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తుంది. ప్రభుత్వ బస్సులలో చిరు ఉద్యోగ, వ్యాపారాలు చేసే మహిళలు మరియు విద్యార్థినులకు ఉచిత ప్రయాణంతో ఆర్థిక భారం తగ్గింది. రూ. 500 లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ తో మహిళలకు గృహ నిర్వాహణ సులభమైంది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకుంటూ తెలంగాణ ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే చట్టాల రూపకల్పనకు కృషి చేస్తున్న తెలంగాణ శాసనసభ్యులను అభినందిస్తున్నాను.

మనమందరం రాజ్యాంగ విలువలను పాటిస్తూ ఇదే విధమైన స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందు తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నానని అన్నారు.

# ధీరోదాత్తుడు రామానందతీర్థ

స్వామి రామానంద తీర్థ (అక్టోబర్ 3, 1903 – జనవరి 22, 1972) స్వాతంత్ర్య సమర యోధుడు, హైదరాబాద్ సంస్థాన విమోచనానికి పాటు పడిన మహా నాయకుడు, భారత పార్లమెంట్ సభ్యుడు, సన్యాసి, కార్మిక నాయకుడు, విద్యావేత్త. ఆయన అసలు పేరు వెంకటరావు ఖేడ్గీకర్. తండ్రి భావూరావు, తల్లి యసుబాయి. 1903 అక్టోబరు 3వ తేదీన అప్పటి హైదరాబాదు సంస్థానంలోని గుల్బర్గా జిల్లా, ఝువర్గీ తాలూకా సింధ్గీ గ్రామంలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి సన్యాసం స్వీకరించటంతో బంధువుల ఔదార్యంతో తన విద్యాభ్యాసాన్ని సాగించ వలసి వచ్చింది. లోకమాన్య బాల గంగాధర తిలక్‌ను ఈయన ఆదర్శంగా తీసుకున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉండగానే 1920 జూలై 31 వ తేదీ రాత్రి లోకమాన్య బాలగంగాధర తిలక్ కాలధర్మం చెందారన్న వార్త విని బ్రహ్మచారిగా తన జీవితాన్నంతా మాతృభూమి సేవకే అంకితం చేయగలను అని ప్రతిజ్ఞ చేసి, ఆ ప్రకారమే ఉండి పోయిన ధీరోధాత్తుడు ఆయన. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని బడికి గాంధీ టోపీ వేసుకుని వెళ్ళి తన నిరసన తెలిపి కొంత కాలం చదువుకు సెలవిచ్చారు. తరవాత పూనాలోని తిలక్ విద్యాపీఠ్‌లో మూడేళ్ళు అధ్యయనం చేసి, ప్రజాస్వామ్యం, దాని క్రమాభివృద్ధి అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి పూనా విశ్వవిద్యాలయానికి సమర్పించి ఎం.ఏ పట్టా పొందారు. కొంత కాలం ప్రసిద్ధ కార్మిక నాయకుడు ఎన్ ఎం జోషి కార్మికోద్యమంలో పాల్గొన్నారు. 1926 లో ఢిల్లీలో ఉండగా పాక్షిక పక్షవాతానికి గురై కొంత కాలానికి కోలుకున్నాడు. తన ఆరోగ్య పరిమితి దృష్ట్యా జోషి అనుమతితో కార్మికోద్యమానికి స్వస్తి చెప్పి ఒస్మనాబాద్ స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడిగా చేరారు. ఈ దరిమిలా హైదరాబాదు రాష్ట్రంలో హిందువులపై జరుపుతున్న దుశ్చర్యలు, ఆంక్షల గురించి తెలుసుకున్నారు. అప్పటి ప్రభుత్వం, హిందూ ఉన్నత పాఠశాల స్థాపనకు నిరాకరించింది. ఐతే ఓ లొసుగును ఉపయోగించుకుని ప్రాథమిక పాఠశాలను విస్తరించి ఉన్నత పాఠశాల నెలకొల్పాడు. ఆ స్కూల్ ప్రప్రథమ ప్రధానోపాధ్యాయుడిగా రామానంద తీర్థను నియమించడం జరిగింది. హిప్పర్గి పాఠశాల ప్రధానోపాధ్యాయుడై, ఆరు సంవత్సరాల పాటు ఆ విద్యా సంస్థను గురుకుల పద్ధతిపై చక్కగా ఆయన నిర్వహించారు. మరాఠ్వాడాలో ఉస్మానాబాదు జిల్లాలోని 1932లో స్వామి నారాయణ అనే గురువు ఆయనకు 'విద్వత్ సన్యాసం ' అనే పద్ధతి ప్రకారం సన్యాస దీక్ష ఇచ్చి, 'స్వామీ రామానంద తీర్థ' అని నామకరణం చేశారు. 1938లో రాజకీయ రంగంలోకి ప్రవేశించి ఆయన మహారాష్ట్ర పరిషత్తుకు కార్యదర్శిగా పనిచేసి, ఆ సంవత్సరమే తన నివాసాన్ని మోమినాబాదు నుంచి హైదరాబాదుకు ఆయన మార్చారు. నిజాం సంస్థానంలో ఆనాడు ఎవరూ పాలనా సంస్కరణల్ని కోరినా నవాబులు దానిని మతపరమైన అంశంగా చిత్రీకరించే వారు. దాంతో మత ప్రమేయం లేని ఒక రాజకీయ సంస్థ ఆవిర్భావం ఆవశ్యకమైంది. ఆ అవసరాన్ని తీరుస్తూ వెలిసిందే 'హైదరా బాద్ స్టేట్ కాంగ్రెస్. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అవసరాన్ని తొలిసారి గుర్తించింది స్వామి రామానంద తీర్థ. ఆయనే సంస్థ స్థాపనకు ప్రధాన కారకుడు. 1938, సెప్టెంబర్ 8న ఒక మహాజన సభ సమావేశాన్ని జరిపి అందులో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. కానీ, ఈ సమావేశ ముందు రోజు 1938, సెప్టెంబర్ 8న అప్పటి హైదరాబాద్, ప్రధాని సర్ అక్బర్ హైదర్ ఈ సంస్థను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ సందర్శన చేశారు. అలా హైదరాబాద్ సంస్థానంలోనే కాదు... బహుశా దేశంలోనే ఆవిర్భావానికి ముందే నిషేధానికి గురైన సంస్థగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిలిచింది. బూర్గుల రామకృష్ణా రావు హైదరాబాద్ స్టేట్ స్టేట్ కాం కాంగ్రెస్ మత సంస్థ కాదని ప్రభుత్వానికి తెలియజేస్తూ చర్చలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అహింసాయుత సత్యాగ్రహం ద్వారా మాత్రమే నిషేధాజ్ఞల్ని తొలిగింప చేసు కోవాలని కాంగ్రెస్ ప్రతినిధులు భావించారు. 1938 అక్టోబర్ లో సత్యాగ్రహం ప్రారంభమైంది. ఆ సంవత్సరం అక్టోబర్ 24న రావి నారాయణరెడ్డి, రామకృష్ణ దూత్, జనార్ధనరావు దేశాయ్, గోవిందరావు నానక్ కలిసి స్వామి రామానంద తీర్థ నేతృత్వంలో సత్యాగ్రహం చేశారు. వీరిలో సత్యాగ్రహం ఉద్యమ మొదటి డిక్టేటర్ (సర్వాధికారి) రామానంద తీర్థ కావడం గమనార్హం. ఈ క్రమంలో స్వామి రామానంద తీర్థను హైదరా బాదులో 1938 అక్టోబరు 27వ తేదీన ప్రభుత్వం బంధించి, 18 నెలలు కఠిన శిక్షకు గురి చేసింది. నిషేధం తొలగించని కారణంగా, తాను వ్యక్తిగత సత్యాగ్రహం చేస్తానని స్వామీజీ అప్పటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి తెలియ చేయగా, 1940 సెప్టెంబర్ 11 వ తేదీన ఆయనను బంధించి, ప్రజారక్షణ నిబంధనల క్రింద నిజామాబాద్ కారాగారంలో నిర్బంధంలో ఉంచారు. 1942–1950 సంవత్సరాల మధ్య హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. దేశీయ సంస్థానాల మహాసభ కార్య నిర్వాహక వర్గ సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగస్ట్‌లో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింప బడిన బొంబాయి కాంగ్రెస్ సభలో పాల్గొని షోలాపూర్ నుంచి తిరిగి రాగానే ఆయనను నిజాం ప్రభుత్వం బంధించి1943 డిసెంబరులో విడుదల చేసింది. హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని ఉద్యమాన్ని ప్రారంభించి నందుకు ఆయనను 1948 జనవరిలో బంధించి, అనేక జైళ్ళల్లో ఉంచారు. నిజాం సైన్యం భారత ప్రభుత్వ సైన్యానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17వ తేదీన రామానంద తీర్థ స్వామి నిర్బంధం నుండి విడుదల అయినారు. రామానంద తీర్థ నాందేడ్‌లోని పీపుల్స్ కాలేజి వ్యవస్థాపకుడు. హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులు, 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగాను పని చేశారు. 1952 నుండి 1962 వరకు లోకసభ సభ్యులుగా ఉన్నాడు. 1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహా సభకు స్వామీజీ ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. హైదరాబాదు సంస్థానాన్ని భాషా ప్రాతిపదికపై విభజించాలని 1953లోనే గట్టిగా కోరిన స్వామీజీ ఎనిమిది తెలంగాణ జిల్లాలను మద్రాసు రాష్ట్రం నుండి విడిపడ్డ ఆంధ్ర ప్రాంతంలో కలిపేసి తెలుగు ప్రజల చిరకాల వాంఛయైన విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని ఒక ప్రకటన చేశారు. అంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన అంధ్రప్రదేశ్ పౌరుడుగానే హైదరాబాదులో నివాసం ఏర్పరుచు కొన్నారు. 1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభాజీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూత నిచ్చారు. స్వామీజీ 1972 జనవరి 22 వ తేదీన హైదరా బాదులో నిర్యాణం చెందారు. రామానంద తీర్థ స్మారక తపాళా బిళ్ళను విడుదల చేశారు.

## వ్యావహారిక భాషా పితామహుడు

తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న సాహితీవేత్త గిడుగు రామమూర్తి పంతులు రామమూర్తి (1863–1940). ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వారు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనా వైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది.

తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకులు. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని ఆయన. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామ్యాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వారితో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టారు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నారు. సాహిత్య ప్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి, నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు. తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నారు. భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించారు, నచ్చచెప్పారు. వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు... వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి.

1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించారు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ు ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపారు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసారు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంథిక భాషే పాతుకు పోయిందిబీ కొన్నిటిలో వీరేశలింగం ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించారు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాస పత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించారు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావఝుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు.

1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది. వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి. వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు.

మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించుకోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నారు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంత డబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర–ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవర భాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర–ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్–ఇ–హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది. మనదేశంలో మొట్టమొదట ఆస్ట్రో–ఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ అయిన ముండా భాషల ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించిన వారు గిడుగు రామమూర్తి. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాకముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు. వీరిని "శబరు"లనే ఆదిమ జాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు.

హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివారు. విషయ పరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయులను గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు రాసి ప్రచురించారు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసుతో అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాక, ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు దృష్టి మరల్చారు.

1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందారు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలి పెట్టక పోవటానికి బాధపడ్డారు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము పరిగణిస్తున్నది. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.

## కథాసాహిత్యంలో ఇందిరాదేవి ముద్ర

తెలంగాణ సాహిత్య చరిత్రలో నందగిరి ఇందిరాదేవి పేరును చిరస్థాయిగా నిలిచి పోయింది. కథా రచయిత్రిగా, సామాజిక సేవకురాలిగా, ఉద్యమ కారిణిగా, తెలంగాణ మహిళల అభ్యున్నతికి కృషి చేసిన సాహిత్య ప్రవంతిగా ఆమె పేరు నిలిచి పోయింది. ఆమె రచనలు సామాజిక సమస్యలను చర్చించడమే కాకుండా, మార్పు కోసం ఉద్యమాలకు ప్రేరణగా నిలిచాయి. నందగిరి ఇందిరాదేవి 1919 సెప్టెంబర్ 22న వరంగల్ జిల్లా హన్మకొండలో జన్మించారు. ఆమె చిన్ననాటి నుంచే సాహిత్యం పట్ల ఆసక్తిని ప్రదర్శించి, రచనా శక్తికి బీజం వేశారు. తన విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన అనంతరం, ఆమె సమాజ సేవలో తనను తాను నిమగ్నం చేశారు. విద్య, సాహిత్యం, సామాజిక సేవలను సమన్వయంతో నడిపి, ఆమె తన జీవితాన్ని ఒక ఆదర్శంగా మార్చారు. నందగిరి ఇందిరాదేవి కథా సాహిత్యానికి ప్రత్యేకమైన ముద్రను వేశారు. ఆమె కథలు పాఠకుడి హృదయాన్ని కదిలించడమే కాకుండా, సమాజాన్ని ప్రతిబింబించాయి. ఆమె కథల్లో ప్రధానంగా సామాజిక సమస్యలు, మహిళా సమస్యలు, కుటుంబ జీవితంలోని సంక్షోభాలు, స్త్రీపురుషుల మనస్తత్వాలు ఉంటాయి. నందగిరి రచనల్లో పాత్రలు జీవంతో నిండినవిగా కనిపిస్తాయి. ప్రతి పాత్రకి సామాజికత, భావోద్వేగాలు, జీవితంలో ఉన్న సమస్యల ముద్ర ఉంటాయి. ఆమె భాష సరళమైనదే కాకుండా, ఆలోచనలను ఉత్తేజపరిచే శైలిని కలిగిఉంటుంది. ఆమె రచనల్లో హాస్యం కూడా సున్నితంగా పలుకుతుంది. ఆమె రచనలు ఆంధ్రజ్యోతి, చిత్రగుప్త, ఆంధ్రకేసరి, శోభ, ప్రజామిత్ర వంటి పత్రికల్లో విరివిగా ప్రచురితమయ్యాయి. వాయిద్యం సరదా వంటి కథలు మానవ స్వభావాలపై సున్నితమైన విశ్లేషణలు చేస్తాయి. సాహిత్యం మాత్రమే కాదు, నందగిరి ఇందిరాదేవి సమాజ సేవలో కూడా చురుగ్గా పాల్గొన్నారు. మహిళా ఉద్యమాలలో మహిళల్లో అక్షరాస్యత పెంచడం, మహిళల జీవితాలను మార్పు తేలుస్తూ ఉద్యమాలు నడిపడం వంటి కృషిలో ముందుండి పాల్గొన్నారు. స్నేహితురాళ్లతో కలిసి ఆమె "ఆంధ్ర యువతీ మండలి"ని స్థాపించారు. దక్కన్ రేడియోలో ప్రసంగించిన తొలి రచయిత్రిగా ఆమె పేరు నిలిచింది. అరవై ఏళ్లపాటు ఆమె ప్రసంగాలు కొనసాగాయి. "మసకమాటున మంచిముత్యాలు" పేరిట వాటిని సంకలనం చేశారు. నందగిరి ఇందిరాదేవి ఒక సాంఘిక సంస్కరణోద్యమ సారథిగా ప్రముఖ పాత్ర పోషించారు. బాల్య వివాహాల పట్ల ఆమె నిరసన వ్యక్తం చేశారు. వ్యక్తిగత జీవితంలో కూడా ఈ నిబంధనను పాటిస్తూ, యుక్తవయస్సులోనే ఆమె వివాహం చేసుకున్నారు. 1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్రమహాసభల్లో ఆమె అధ్యక్షత వహించడం ద్వారా మహిళా చైతన్యానికి దోహదం చేశారు. 1940లో హైదరాబాద్ అఖిలాంధ్ర కథకుల సమావేశాన్ని నిర్వహించి, కథా సాహిత్యం మీద విస్తృత చర్చలు చేశారు. ఆమె భర్త నందగిరి వెంకట్రావు తెలంగాణ తొలి తరం కథకుల్లో ప్రముఖులుగా పేరుగాంచారు. 2007 జనవరి 22న ఆమె పరమపదించారు. నందగిరి ఇందిరాదేవి తెలుగు సాహిత్యానికి, తెలంగాణ సంస్కృతికి ఇచ్చిన కృషి అనన్యసామాన్యం. ఆమె కథలు కేవలం రచనలుగా నిలిచిపోకుండా, సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయి. ఆమె జీవితం, రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. నందగిరి ఇందిరాదేవి ఒక కథా రచయిత్రిగా మాత్రమే కాక, తెలుగు మహిళా చైతన్యానికి ఒక వెలుగు దీపంగా నిలిచారు.

## దివ్యాంగ ఫించన్లపై సర్వేలు. పరీక్షలు

విశాఖపట్టణం, జనవరి 21, కూటమి ప్రభుత్వం పింఛన్లపైఫోకస్ చేసింది. ప్రభుత్వం 14 రకాల సామాజిక పింఛన్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే 3000 రూపాయల పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన మొత్తాన్ని అందించారు. మూడు నెలల బకాయి తో పాటు చెల్లించారు. మరోవైపు కొత్త పింఛన్ల జారీకి సంబంధించి ప్రక్రియ ప్రారంభించారు. అయితే ఇప్పటికే అందిస్తున్న పింఛన్లలో భారీగా బోగస్ ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా వికలాంగుల పింఛన్లకు సంబంధించి చాలా రకాల అనుమానాలు ఉన్నాయి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వికలాంగ పింఛన్లు పొందారు అన్నది ప్రధాన ఆరోపణ. దానిపై ఫోకస్ పెట్టింది కూటమి ప్రభుత్వం. బోగస్ పింఛన్లు తొలగించి కొత్త వాటిని అందించేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల కు సంబంధించి దివ్యాంగ పింఛన్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఇందులో చాలామంది తప్పుడు వైకల్య ధ్రువపత్రాలు పెట్టి పింఛన్లు పొందుతున్నారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు కూడా వచ్చాయి. దీంతో విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ప్రయోగాత్మకంగా కొన్ని సచివాలయాల పరిధిలో తనిఖీలు చేపట్టింది. దివ్యాంగ పింఛన్లలో భారీగా బోగస్ ఉన్నట్లు తనిఖీల్లో తేలింది. అందుకే ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగ పింఛన్లకు సంబంధించి తనిఖీ జరుగుతోంది. బోగస్ అని తేలితే వెనువెంటనే తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం తనిఖీలు జరుగుతుండడంతో బోగస్ లబ్ధిదారుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోందిసాధారణంగా దివ్యాంగ పింఛన్లకు సంబంధించి.. మూడు విభాగాలుగా విభజించారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతూ మంచానికి పరిమితమైన వారికి ప్రభుత్వం 15000 రూపాయలు కింద పింఛన్ మొత్తాన్ని అందిస్తోంది. ప్రస్తుతం వీరిని ముగ్గురు వైద్యులతో కూడిన బృందం పరిశీలిస్తోంది. అక్కడికక్కడే వారి ఆరోగ్య వివరాలను నమోదు చేసే ప్రక్రియ సైతం కొనసాగుతోంది. అయితే చాలామంది అర్హత లేని వారికి సైతం 15 వేల రూపాయల చొప్పున పింఛన్ అందుతున్నట్లు గుర్తిస్తున్నారు. ఇంకోవైపు తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వారికి పదివేల రూపాయలు చొప్పున అందిస్తున్నారు. దీనిలో ఎక్కువ మంది అనర్హులు ఉన్నట్లు తాజాగా చేస్తున్న తనిఖీల్లో బయటపడుతోందిఇంకోవైపు వైకల్యంతో బాధపడుతున్న సాధారణ మనుషులకు 6000 రూపాయలు చొప్పున పింఛన్ అందిస్తున్నారు. అయితే ఇందులో సైతం ఎక్కువమంది బోగస్ ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరికీ సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. గతం మాదిరిగా గుంప గుత్తిగా కాకుండా.. నిర్దిష్టమైన కొంతమందికి ముందుగానే సమాచారం ఇస్తున్నారు. వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. అయితే వీరిలో సైతం భారీగా బోగస్ లబ్ధిదారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ప్రత్యేక నమోదు ప్రక్రియ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారుఅయితే పింఛన్ల తనిఖీప్రక్రియ మరో రెండు నెలల పాటు కొనసాగే అవకాశం ఉంది. అప్పటివరకు కొత్త పింఛన్లకు సంబంధించి జారీ ఉండకపోవచ్చు. బహుశా మార్చి నెలలో భారీగా ఉన్న ఈ బోగస్ పింఛన్ల తొలగింపు చేపట్టవచ్చు. ఇందుకు సంబంధించి అనర్హుల జాబితా కూడా ప్రకటించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. 18 లక్షల వరకు ఉన్న ఈ పింఛన్లలో సగానికి సగం బోగస్ అని ప్రచారం జరుగుతోంది. మరి ఈ తొలగింపు జాబితాలో ఎంతమంది ఉంటారో తెలియాలి

# వారసుల సక్సెస్ రేటు ఎంత...

విజయవాడ, జనవరి 21, రాజకీయ పార్టీలు వారసులకు పగ్గాలు అప్పగించడం పరిపాటి. ప్రధానంగా ప్రాంతీయ పార్టీల్లో వారసులదే పార్టీలో ఆధిపత్యం.తండ్రులు, తాతలు స్థాపించిన పార్టీలను వీరు సక్రమంగా జనంలోకి తీసుకెళ్లి సక్సెస్ అవుతున్నారా? లేదా? అంటే సక్సెస్ రేటు మాత్రం తక్కువగానే ఉందని చెప్పాలి. దేశ వ్యాప్తంగా అనేక మంది ప్రాంతీయ పార్టీలను నెలకొల్పి తమ రాష్ట్రాల్లో అధికారాల్లోకి తెచ్చారు. కానీ వారసుల టైం వచ్చేసరికి మాత్రం పార్టీ వ్యవహారం మాత్రం తలకిందులవుతుంది. ఎక్కువ శాతం ఓటములు వారి ఖాతాల్లో పడుతున్నాయి. దీంతో వారసులు పార్టీని సక్రమంగా నడపలేకపోతున్నారని, తండ్రులే బెటర్ అన్న కామెంట్స్ పొలిటికల్ పార్టీల్లో ఉన్నాయి.. ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీని ములాయం సింగ్ యాదవ్ నుంచి పగ్గాలు అందుకున్న తర్వాత అధికారంలోకి ఒకసారి మాత్రమే అఖిలేష్ యాదవ్ పార్టీని తీసుకు రాగలిగారు. ఎక్కువ సార్లు ఓటమి చవి చూశారు. తన తండ్రి స్థాపించిన పార్టీని సక్రమంగా నడపలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక బీహార్ లోనూ లాలూ ప్రసాద్ యాదవ్ రాష్ట్రీయ జనతా దళ్ నేతృత్వంలో పార్టీని అధికారంలోకి తేగలిగారు. పలుమార్లు ముఖ్యమంత్రిగా కూడా ఆయన చేశారు. కానీ ఆయన తనయుడు తేజస్వి యాదవ్ చేతుల్లోకి వచ్చిన తర్వాత అది పూర్తిగా ఓటమి అంచునే తిరుగుతూ ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీని తీసుకుంటే ఇందిరాగాంధీ పరావాలేదనిపించారు. తర్వాత రాహుల్ గాంధీ ఓకేలా పార్టీని విజయం వైపు నడిపించారు. తర్వాత వారసురాలిగా సోనియా గాంధీ కూడా రెండు సార్లు అధికారంలోకి తేగలిగారు. తర్వాత రాహుల్ గాంధీ నేతృత్వంలో రెండుసార్లు పార్టీ ఓటమి పాలయ్యింది. దక్షిణాది రాష్ట్రాల్లో... మహారాష్ట్రలో శివసేన కూడా అంతే. బాల్ థాక్రే ఉన్న సమయంలో ఒక ఊపు ఊపిన శివసేన నేడు వారసుడు ఉద్ధవ్ థాక్రే హయాం వచ్చేసరికి డీలా పడింది. రేపు ఆయన వారసుడు ఆదిత్య ధాక్రే ఏ మేరకు పార్టీని నడుపుతాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క ఒడిశాలో మాత్రమే తన తండ్రి స్థాపించిన పార్టీని ఐదు సార్లు అధికారంలోకి నవీన్ పట్నాయక్ తేగలిగారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అలాగే కరుణానిధిని లెగసీని స్టాలిన్ ఒకసారి అందుకున్నారు. రెండోసారి ఆయన పార్టీని అధికారంలోకి తెస్తారా? అన్నది చూడాల్సి ఉంది. కర్ణాటకలోనూ దేవెగౌడ పలుమార్లు అధికారంలోకి తెచ్చిన జేడీయూను ఆయన తనయుడు కుమారస్వామి పార్టీని అధోగతి పాల్జేశారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఏతా వాతా తేలిందేంటంటే దేశంలో అన్ని రాష్ట్రాల్లో వారసులను జనం పెద్దగా ఆదరించలేదు. తెలుగు రాష్ట్రాల్లో... ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఎన్టీఆర్ వారసులు ఎవరూ రాజకీయాల్లోకి రాకపోయినా ఆయన వారసుడిగా చంద్రబాబు నాలుగుసార్లు అధికారంలోకి తెచ్చారు. అదే తన తండ్రి పేరు మీద అన్న తెలుగుదేశం పార్టీ పెట్టి ఎన్టీఆర్ తనయుడు హరికృష్ణ నెగ్గకురాలేకపోయారు. ఇక కాంగ్రెస్ పార్టీని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండుసార్లు పార్టీని అధికారంలోకి తేగలిగారు. ఆయన కుమారుడు జగన్ రెండుసార్లు ఓటమి పాలయి, ఒకసారి అధికారంలోకి తేగలిగారు. వైఎస్ కుమార్తె షర్మిల అయితే పార్టీ పెట్టడం, విలీనం చేయడం కూడా జరిగిపోయాయి. ఇక తాజాగా లోకేష్ కు కూడా ప్రమోషన్ ఇవ్వాలని, ప్రభుత్వంలో ప్రాధాన్యత ఇవ్వాలని వినిపిస్తున్న డిమాండ్ కూడా సీనియర్ నేతలు చేస్తుండటంతో వారసుల సక్సెస్ రేటుపై చర్చ జరుగుతుంది. వారసులు ఎక్కువగా రాజకీయంగా విఫలమవుతున్నారన్నదే పొలిటికల్ ఫిగర్స్ చెబుతుండగా, సీనియర్ నేతలు మాత్రం అవేమీ పట్టించుకోకుండా ప్రాపకం కోసం ప్రయత్నిస్తున్నారు. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

# లోకేశ్ కు డిప్యూటీ సీఎం డిమాండ్
# నష్టనివారణ చర్యల్లో టీడీపీ అధిష్టానం

విజయవాడ, జనవరి 21 మంత్రి నారా లోకేశ్ కు డిప్యూటీ సీఎం హోదా కల్పించాలని టీడీపీ నేతల నుంచి వస్తోన్న డిమాండ్లపై పార్టీ అధిష్ఠానం కీలక ఆదేశాలు జారీ చేసింది. డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ మాట్లాడొద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఈ అంశంపై ఎవరూ మీడియా ముందు బహిరంగ ప్రకటనలు చేయొద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని ప్రకటించింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని ప్రకటనలో పేర్కొంది.సీఎం చంద్రబాబు వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు పర్యటనలో...కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని ప్రతిపాదించారు. ఆయన ప్రతిపాదనను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మద్దతు పలికారు. లోకేశ్ కు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అనంతరం పలువురు నేతలు ఈ అంశంపై బహిరంగంగా మాట్లాడారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎంను చేయాలని బహిరంగ వ్యాఖ్యలు చేశారు.టీడీపీ నేతలు ఒక్కొక్కరిగా బహిరంగ ప్రకటన చేస్తుండడంతో అధిష్ఠానం అలర్ట్ అయ్యింది. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారు చెప్పడం సరికాదని టీడీపీ అధిష్ఠానం భావించింది. ఇలాంటి సున్నితమైన అంశాలపై కూటమి నేతలు కూర్చొని చర్చించి నిర్ణయం తీసుకుంటారని స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది.టీడీపీ నేతల డిమాండ్లకు జనసేన నేతలు కౌంటర్ గా స్పందించారు. పవన్ కల్యాణ్ ను సీఎంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని జనసేన నేతలు స్వరం పెంచారు. తిరుపతి జనసేన ఇన్ ఛార్జ్ కిరణ్ రాయల్ ఈ అంశంపై స్పందించారు. తమ దృష్టిలో మెగా బ్రదర్స్ అంటే ముగ్గురు కాదని చంద్రబాబుతో కలిపి నలుగురు అనుకుంటున్నామన్నారు. లోకేశ్ ను డిప్యూటీ పదవిలో చూడాలని టీడీపీ కేడర్ కోరుకోవడంలో తప్పులేదని అన్నారు. అలాగే తాము పవన్ కల్యాణ్ ను సీఎంగా చూడాలని పదేళ్లుగా ఎదురుచూస్తున్నామని చెప్పారు."పవన్ కల్యాణ్ ను సీఎం చూడాలని బడుగు బలహీన వర్గాలు కోరుకుంటున్నాయి. సీఎం, డిప్యూటీ సీఎం పదవుల విషయంలో ఎన్నికల ముందు అధినేతలు ఎలాంటి ఒప్పందంతో ఎన్నికలకు వెళ్లారో అదే కొనగిస్తే మంచిది. అనవసరంగా వైసీపీ నేతల మాటలకు ఊపిరి పోయకండి. వైసీపీలో కొంతమంది జేబులో మైకులు వేసుకుని తిరుగుతున్నారు. వాళ్లకు అవకాశం ఇవ్వవద్దు. పేర్ని నాని, రోజా జేబులో మైకులు వేసుకొని తిరుగుతున్నారు" - జనసేన నేత కిరణ్ రాయల్వివాదం ముదురుతుండడంతో టీడీపీ అధిష్టానం కల్పించుకుంది. డిప్యూటీ సీఎం వ్యవహారంపై ఎవరూ బహిరంగ ప్రకటన చేయొద్దని సూచించింది. ఏదైన ఉంటే కూటమి పార్టీలు కూర్చొని మాట్లాడుకుంటాయని పేర్కొంది. వ్యక్తిగత అభిప్రాయాన్ని పార్టీపై రుద్దవద్దని కోరింది. టీడీపీ అధిష్ఠానం ప్రకటనతో డిప్యూటీ సీఎం వివాదానికి ఫుల్ స్టాప్ పడుతుందో లేదో చూడాలి.

ఫ్యూచర్ సీఎం అంటూ భరత్ కామెంట్స్

ఏపీలో పదవుల కోసం కొట్లాట మొదలైంది. డిప్యూటీ సీఎం హోదా కోసం మొదలైన ఫైట్...ఇప్పుడు సీఎం స్థాయికి చేరింది. లోకేశ్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాల్సిందే అంటూ టీడీపీ నేతలు, మంత్రులు గట్టిగానే డిమాండ్ చేస్తున్నారు. పార్టీలో ఎవరికి నచ్చినా నచ్చకపోయినా లోకేశ్ భవిష్యత్ సీఎం అంటూ ప్రకటించేస్తున్నారు. వ్యక్తిగత ప్రకటనలను పార్టీపై రుద్దొద్దని అధిష్టానం ప్రకటన వచ్చిన గంటల వ్యవధిలోనే మంత్రి టీజీ భరత్ సంచలన ప్రకటన చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందంతో దావోస్ వెళ్లిన మంత్రి టీజీ భరత్ లోకేశే భవిష్యత్ సీఎం అంటూ ప్రకటన చేశారు. దీంతో ఇప్పుడు లోకేశ్ డిప్యూటీ సీఎం చర్చ నుంచి సీఎంకు టర్న్ అయ్యింది.దావోస్ లో తెలుగు పారిశ్రామికవేత్తల సదస్సుల్లో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ...ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా భవిష్యత్ ముఖ్యమంత్రి లోకేశ్ అంటూ కుండబద్దలు కొట్టారు. "175 ఎమ్మెల్యేలు, 25 మంది లోక్ సభ ఎంపీలు, రాజ్యసభ ఎంపీల్లో స్టాన్ ఫర్డ్ యూనివర్సిటీ నుంచి చదివిన వాళ్లు ఎవరూ లేరు ఒక్క లోకేశ్ తప్ప. లోకేశ్ చాలా ఉన్నత చదువులు చదివారు. ఆయనకు ఎప్పుడు ఏం చేయాలో పూర్తిగా తెలుసు. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా టీడీపీకి ఫ్యూచర్ లోకేశ్. కాబేయే ముఖ్యమంత్రి లోకేశ్" అని మంత్రి టీజీ భరత్ అన్నారు.

# తెరపైకి మళ్లీ నామినేటెడ్ పదవులు

ఒంగోలు, జనవరి 21, ఏపీలో నామినేటెడ్ పదవులు మళ్లీ తెరపైకి వచ్చాయి. నామినేటెడ్ పదవులను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పార్టీ క్యాడర్ కూడ అదే తరహాలో త్వరగా పదవులను భర్తీ చేయాలని కోరుకుంటున్నారు. ఈ దశలో సీఎం చంద్రబాబు తన నివాసంలో పార్టీ ప్రధాన నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అసలు చర్చ ఎలా సాగిందంటే..రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కావడంతో పార్టీ క్యాడర్ ఉత్సాహంగా ఉంది. అంతేకాదు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లు కూడ ఆయా జిల్లాల అధ్యక్షులను, మంత్రులను, ఎమ్మెల్యేలను, నాయకులను, కార్యకర్తలను అభినందిస్తూ ట్వీట్ కూడ చేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు 1,00,52,598 దాటడం ఎంతో గర్వకారణమని, రాజకీయ పార్టీల సభ్యత్వ నమోదులో ఇదో గొప్ప రికార్డుగా చంద్రబాబు అన్నారుకార్యకర్తల కష్టమే ఈ ఫలితం. కోటి మంది పసుపు సైన్యంతో పార్టీని తీర్చిదిద్దిన కార్యకర్తే పార్టీకి అధినేత. కార్యకర్తల పార్టీగా దినదిన ప్రవర్ధమానమై తెలుగుదేశం వర్ధిల్లుతోందని, ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న నారా లోకేష్ ను ప్రత్యేకంగా చంద్రబాబు అభినందించారు.అయితే ఏపీ కేబినెట్ భేటీ అనంతరం ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ మంత్రులు, ఎంపీలు, జోనల్ కోఆర్డినేటర్లతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. 7 నెలల పాలనా వ్యవహారాలు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు, పెట్టుబడులు, పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, మెంబర్‌షిప్ కార్యక్రమం, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజా స్పందన వంటి అంశాలపై నేతలతో చర్చించారు. అలాగే నామినేటెడ్ పదవుల భర్తీపై సైతం సుదీర్ఘ చర్చ సాగింది.సాధ్యమైనంత త్వరగా వాటిని భర్తీ చేస్తామని, పార్టీని నమ్ముకున్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగదంటూ చంద్రబాబు హామీ ఇచ్చారట. మంత్రులు, ఎంపీలు ఎప్పటికప్పుడు కార్యకర్తలను సమన్వయం చేసుకునే దిశగా కార్యాచరణ తయారీకి కూడ సిద్ధం కావాలని చంద్రబాబు సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు జనంలోకి తీసుకువెళ్లే విధంగా మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కాగా త్వరలోనే నామినేటెడ్ పదవులను భర్తీ చేసే దిశగా అడుగులు వేస్తుండగా, ఆశావాహుల్లో మళ్లీ ఆశలు పుంజుకున్నాయి. అంతేకాకుండా జనసేన పార్టీలో సైతం నామినేటెడ్ పదవులు ఆశించేవారు కూడ తమ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

# మైనర్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్ జమై ఉస్మానియా యూనివర్సిటీ రైల్వే పట్టాల మీద మైనర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఘటనలో మైనర్ బాలిక భార్గవి తల, మొండం వేరు అయ్యాయి. ఓయూ ఆంధ్రమహిళా సభ కాలేజీ లో ఇంటర్ సీఈసీ చదవుతుంది భార్గవి. సిద్దిపేట జిల్లాకి చెందిన భార్గవి ,హాస్టల్ లో ఉండి చదువుకుంటుంది. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు

# వీఆర్ఎస్ బాటలో స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్

విశాఖపట్టణం, జనవరి 21, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు వీఆర్ఎస్ బాటపట్టారు. ఇప్పటికే 460 మంది ఉద్యోగులు వీఆర్ఎస్‌కు దాఖలు చేసుకున్నారు.

ఈనెల 31 వరకు గడువుండటంతో మరికొంత మంది ఉద్యోగులు వీఆర్ఎస్‌కు దాఖలు చేసుకునే అవకాశం ఉంది. దీంతో స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్య తగ్గుతోంది.రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని చెబుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,444 కోట్లు కేటాయించామని, తద్వారా ప్రైవేటీకరణ ఆగుతుందని చెబుతున్నాయి. అయితే వీఆర్ఎస్ పథకాన్ని అమలు చేయడంపై పలు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే దాదాపు ఏడేళ్లుగా పోస్టులు భర్తీ కాక దాదాపు ఏడు నుంచి ఎనిమిది వేల ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మరో 1,218 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. దీంతో ఆ 1,218 పోస్టులు ఖాళీ కానున్నాయి. 2018 నుంచి ఇప్పటి వరకు పోస్టుల భర్తీ జరగలేదు. దీంతో 2018 నాటికి ఉద్యోగుల దాదాపుగా 16,000 ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 12,332కి తగ్గింది. వీఆర్ఎస్ వల్ల ఆ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంది.2026 జనవరి తరువాత కూడా సర్వీసు ఉన్న ఉద్యోగులకు వీఆర్ఎస్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈనెల 15న ప్రారంభమైన వీఆర్ఎస్‌కు దాఖలు చేసే ప్రక్రియ ఈనెల 31 వరకు కొనసాగనుంది. ఇప్పటి వరకు 12,332 మంది ఉద్యోగుల్లో 2,950 ఎగ్జిక్యూటివ్, 9,382 మంది నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో గత నాలుగు రోజుల్లో 460 మంది వీఆర్ఎస్‌కు దాఖలు చేసుకున్నారు. వీరిలో 208 మంది ఎగ్జిక్యూటివ్, 252 మంది నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఉన్నారు. ఈ వీఆర్ఎస్ పథకానికి రూ.500 కోట్లను కేంద్ర ప్రభుత్వం ప్రతించిందని వైజాగ్ స్టీల్ యాజమాన్యం చెబుతోంది.ఈ వీఆర్ఎస్ పథకంతో ఉద్యోగుల తగ్గుదలకు కారణం అవుతోంది. ఇప్పటికే భర్తీకాని భారీస్తాయిలో ఖాళీలు, మరోవైపు కాంట్రాక్ట్ ఉద్యోగులు రెన్యువల్ చేయకపోవడంతో ఉద్యోగుల కొరత ఏర్పడుతోంది. ఇప్పటికే 4,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల్లో 800 మందికి రెన్యువల్ చేయలేదు. దీంతో వారు పనిలో లేరు. ఇలా సిబ్బంది కొరత ఏర్పడితే స్టీల్ ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. ప్రస్తుతం రెండు ఫర్నేస్‌ల ద్వారా మాత్రమే స్టీల్ ఉత్పత్తి చేస్తోన్నారు. మూడో ఫర్నేస్ ఆగస్టు నాటికి అందుబాటులోకి వస్తోందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చెబుతున్నారు.అయితే మూడు ఫర్నేసులు ఉత్పత్తిలో పాల్గొనాలంటే, ఎక్కువ మంది ఉద్యోగులు, సిబ్బంది అవసరం అవుతారు. ప్రస్తుతం రోజుకు రెండు ఫర్నేసులు 15 వేల టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. వాస్తవానికి రెండు ఫర్నేసులు సామర్థ్యం రోజుకు 14 వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి మాత్రమే. కానీ ఉద్యోగులు, కార్మికులు కష్టంతో అధనంగా మరో 1,000 టన్నుల స్టీల్ ఉత్పత్తి జరుగుతోందని కార్మిక సంఘ నేత ప్రసాద్ తెలిపారు.లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏలు నిలిపివేయడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

దీనికి తోడు అధికారులకు ఆరు శాతం పెర్క్ తొలగించగా, కార్మికులకు హెచ్ఆర్ఏ నిలిపివేశారు. ఉక్కు క్వార్టర్ల నివాసులకు విద్యుత్ ఛార్జీలు పెంచారు. ఇంత ఆర్థిక భార వేసినప్పటికీ జీతమైనా సరిగా వస్తుందా? అంటే అదీ లేదు. గత నాలుగు నెలలుగా యాజమాన్యం ఉద్యోగులకు 250 శాతం జీతం పెండింగ్‌లో పెట్టింది. పీఎఫ్ ట్రస్ట్, ఎస్ఏబీఎఫ్ ట్రస్ట్, త్రిఫ్ట్ సొసైటీలకు సుమారు రూ.1,000 కోట్లు బకాయిలు పడింది.మరోవైపు ఈ ఏడాది నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సక్రమంగా చెల్లించటం లేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల్లో భయం, అభద్రతాభావం పెరిగింది. దీంతో వీఆర్ఎస్‌కు దాఖలు చేసుకున్నవారి సంఖ్య పెరుగుతోంది. అయితే మొదటి రెండు రోజులు దాఖలు చేసుకున్న వారి సంఖ్యతో పోల్చితే, పునరుద్ధరణ ప్యాకేజీ రూ.11,444 కోట్లు ప్రకటించిన తరువాత కొద్దిమేర తగ్గింది.

అంతేతప్ప వీఆర్ఎస్‌కు దాఖలు చేసుకునేవారు మాత్రం ఆగడం లేదు. దీంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.మరోవైపు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.11,444 కోట్లను కూడా ఎలా ఖర్చు చేస్తారనేదానిపై ఉద్యోగుల్లో, కార్మికుల్లో అనేక సందేహాలు ఉన్నాయి. ఇప్పటికే ఎన్ఎండీసీకి 1,500 ఎకరాలను కుదవపెట్టడంతో వచ్చిన సుమారు రూ.2,250 కోట్లు, స్టీల్‌ప్లాంట్ భూమి అమ్మగా వచ్చిన రూ.260 కోట్లను యాజమాన్యం ఏం చేసిందో, ఎలా ఖర్చు చేసిందో అర్థం కావటం లేదని కార్మిక సంఘం నేతలు పేర్కొంటున్నారు. ఈ రూ.11,444 కోట్లు కూడా అలాగే దేనికిపడితే దానికి ఖర్చు చేస్తే, దానివల్ల స్టీల్‌ప్లాంట్‌కు ఉపయోగమేమీ ఉండదని అభిప్రాయ పడుతోన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,444 కోట్లు ఉపసమనం మాత్రమేనని, అంతేతప్ప ఇది పరిష్కారం కాదని సీఐటీయూ నేత సీహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. తాము మొదటి నుంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తోన్నామని తెలిపారు. ఆ రెండు జరగకుండా ఇంకా ఏదీ చేసినా అది శాశ్వత పరిష్కారం కాదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ రెండు అంశాలపై మౌనం దాల్చుతున్నాయి. పైగా ఉద్యోగుల కొరత సృష్టించేందుకు వీఆర్ఎస్ పెట్టారని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలనుకుంటే వీఆర్ఎస్‌ను ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు.

# టీడీపీ, జనసేన సోషల్ మీడియా వార్

గుంటూరు, జనవరి 21, ఏపీ రాజకీయాల్లో డిప్యూటీ సీఎం, సీఎం రచ్చ మొదలైంది. మంత్రి నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ శ్రేణులు కోరుతుంటే...డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను సీఎం చేయాలని జనసేన శ్రేణులు కోరుతున్నాయి. ఆర్నెల్లు ప్రశాంతంగా కొనసాగిన కూటమిలో అగ్గి రాజుకున్నట్లే కనిపిస్తుంది. లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రతిపాదనను టీడీపీ నేతలు తెరపైకి తెచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు...టీడీపీ శ్రేణులు ఒక్కొక్కరిగా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లోకేశ్ కు డిప్యూటీ సీఎం హోదాపై హోం మంత్రి అనిత స్పందిస్తూ... రాసిపెట్టి ఉందేమో.. చూద్దామని అన్నారు. టీడీపీ నేతల డిమాండ్ కు సోషల్ మీడియాలో ఆ పార్టీ శ్రేణులు మద్దతు పలుకుతున్నాయి.లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ శ్రేణులు డిమాండ్ చేస్తుంటే...జనసైనికులు కూడా రంగంలోకి దిగారు. పవన్ కల్యాణ్ ను సీఎంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని జనసేన నేతలు స్వరం పెంచారు. తిరుపతి జనసేన ఇన్ ఛార్జ్ కిరణ్ రాయల్ ఈ అంశంపై స్పందించారు. తమ దృష్టిలో మెగా బ్రదర్స్ అంటే ముగ్గురు కాదని చంద్రబాబుతో కలిపి నలుగురు అనుకుంటున్నామన్నారు. లోకేశ్ ను డిప్యూటీ పదవిలో చూడాలని టీడీపీ కేడర్ కోరుకోవడంలో తప్పులేదని అన్నారు. అలాగే తాము పవన్ కల్యాణ్ ను సీఎంగా చూడాలని పదేళ్లుగా ఎదురుచూస్తున్నామని చెప్పారు."పవన్ కల్యాణ్ ను సీఎం చూడాలని బడుగు బలహీన వర్గాలు కోరుకుంటున్నాయి. సీఎం, డిప్యూటీ సీఎం పదవుల విషయంలో ఎన్నికల ముందు అధినేతలు ఎలాంటి ఒప్పందంతో ఎన్నికలకు వెళ్లారో అదే కొనగిస్తే మంచిది. అనవసరంగా వైసీపీ నేతల మాటలకు ఊపిరి పోయకండి. వైసీపీలో కొంతమంది జేబులో మైకులు వేసుకుని తిరుగుతున్నారు. వాళ్లకు అవకాశం ఇవ్వవద్దు. పేర్ని నాని, రోజా జేబులో మైకులు వేసుకొని తిరుగుతున్నారు" - జనసేన నేత కిరణ్ రాయల్పవన్ సీఎం, లోకేశ్ డిప్యూటీ సీఎం చర్చపై సోషల్ మీడియా పోస్టులు పేలుతున్నాయి. టీడీపీ, జనసేన మద్దతుదారులు పోటాపోటీగా పోస్టులు పెడుతున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిసిన అనంతరం పవన్ కల్యాణ్...జైలు బయటే పొత్తు ప్రకటించిన వీడియోలు షేర్ చేస్తున్నారు. టీడీపీ శ్రేణులు సైతం చంద్రబాబు పొత్తు ధర్మం పాటిస్తున్నారని చెబుతున్నాయి. టీడీపీ నేతలే అగ్గి రాజేశారని జనసేన నేతలు అంటున్నారు. పొత్తు ధర్మం పాటించకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని ఇరుపార్టీలు నేతలు వాదించుకుంటున్నారు.ఇటీవల పరిణామాలు చూస్తుంటే కూటమిలో చీలిక తప్పదేమోనన్న సందేహం కలుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాకినాడ పోర్టు, తిరుపతి తొక్కిసలాట వ్యవహారంలో పవన్ కల్యాణ్ దూకుడుగా వ్యవహరించడంతో...లోకేశ్ ను రంగంలోకి దింపాలని టీడీపీ భావిస్తుంది. కూటమి పార్టీలు జట్టు కట్టే సమయంలో చంద్రబాబు సీఎం, డిప్యూటీ సీఎంగా పవన్ ఒక్కరే ఉండాలన్న ఒప్పందం జరిగిందని విశ్లేషకులు అంటున్నారు. లోకేశ్ కు డిప్యూటీ సీఎం అంశం తెరపైకి రావడంతో...మూడు పార్టీలు చర్చించుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని అంటున్నారు.రాజకీయ పార్టీల్లో ఇలాంటి డిమాండ్లు సహజమేనని, తమ నేతను ఉన్నతస్థాయిలో చూడాలని శ్రేణులు భావిస్తుంటాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ వ్యవహారం చేయిదాటిపోకముందే ఇరు పార్టీల అధినేతలు కల్పించుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

# కాక రేపుతున్న అమిత్ షా టూర్



విజయవాడ, జనవరి 21,ఏపీలో అమిత్ షా పర్యటన సాగింది.. ముగిసింది. కానీ ఆ పర్యటన తాలూకు నీడలు మాత్రం కాక రేపుతున్నాయి. ఒకే నెలలో పీఎం మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటన సాగింది. దీని వెనుక పెద్ద కథే ఉందని వైసీపీ విస్తృత ప్రచారం చేస్తోంది. పీఎం పర్యటన ఏమో కానీ, అమిత్ షా పర్యటన గురించి మాత్రం పలు కథనాలు ప్రచారంలోకి వచ్చాయి.ఏపీ పర్యటన నిమిత్తం అమిత్ షా వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఈ సంధర్భంగా ముందుగా సీఎం చంద్రబాబు ఇంటికి ఆయన వెళ్లారు. అక్కడ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు ఇద్దరు కూడ ఉన్నారు. వీరితో అమిత్ షా చర్చలు గోప్యంగా సాగినా, బయట మాత్రం ప్రచారం వాడివేడిగా జరిగిందంటూ సాగుతోంది. లోకేష్ పై ఫిర్యాదులు వచ్చాయని, పవన్ కళ్యాణ్ కు సముచిత స్థానం ఉండాల్సిందేనని అమిత్ షా తెగేసి చెప్పినట్లు ప్రచారంలో ఉంది. ఈ ప్రచారం సాగిస్తున్నది కూడ ఎవరో కాదు సాక్షాత్తు వైసీపీ నేతలేమాజీ మంత్రి అంబటి రాంబాబు ఇదే విషయంపై మాట్లాడారు. అసలు జరిగిన విషయాన్ని వదిలి, టీడీపీ ఏవేవో ప్రచారం సాగిస్తుందన్నారు. అంతేకాదు లోకేష్ ను కంట్రోల్ చేయండని అమిత్ షా చెప్పినట్లు తనకు తెలిసిందంటూ అంబటి చెప్పడం విశేషం. అయితే ఇదే విషయంపై టీడీపీ మరో ప్రచారం సాగిస్తోంది. మాజీ సీఎం జగన్ ఆస్తుల గురించి అమిత్ షా అడిగినట్లు, ఇప్పుడు జగన్ ఏం చేస్తున్నారని అడిగారని సోషల్ మీడియా వేదికగా ముమ్మర ప్రచారం జరుగుతోంది.అమిత్ షా మాత్రం కూటమి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తే, వైసీపీ మాత్రం భిన్నరీతిలో ప్రచారం సాగించడంపై టీడీపీ వాటిని తిప్పికొట్టేందుకు శ్రమిస్తోందని చెప్పవచ్చు. అక్కడ భేటీ రహస్యంగా సాగితే ఈ ప్రచారాలు మాత్రం పెద్ద తలనొప్పులు తెస్తున్నాయట టీడీపీకి. అలాగే తిరుమల వరుస ఘటనల గురించి కూడ, అమిత్ షా ఆరా తీయడం అందరికీ తెల్సిన విషయమే. ఏదిఏమైనా అమిత్ షా పర్యటన అనంతరం లోకేష్ గురించి ఆగ్రహం అంటూ వైసీపీ, జగన్ గురించి ఆరా తీశారని టీడీపీ ప్రచారం సాగిస్తుండగా, అసలు విషయం మాత్రం అక్కడ భేటీలో పాల్గొన్న వారికే ఎరుక. దీనితో నారా లోకేష్, జగన్ ఇద్దరూ అమిత్ షా టూర్ టెన్షన్ లో ఉన్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం ఊపందుకుంది.

# టీటీడీ వ్యవహారాలపై మౌనం ఎందుకో..

తిరుమల, జనవరి 21, అధికారాన్ని సమర్థంగా వినియోగించుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సర్కారుకి వ్యతిరేకంగా అనవసర ప్రచారం జోరుగా సాగుతున్నప్పటికీ నేతలు ఖండించలేక పోతుండటం కూటమి శ్రేణులకు మింగుడు పడటం లేదంట.

తిరుమల వ్యవహారాలకు సంబంధించి వైసీపీ చేస్తున్న విమర్శలను కూటమి శ్రేణులు ఖండించ లేక పోతున్నాయి. దాంతో ప్రతి చిన్న విషయంపై రాద్ధాంతం చేస్తున్న వైసీపీ నేతల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఆరోపణలు గుప్పిస్తుంది.టీటీడీ పాలకవర్గం ఏర్పడిన అరు నెలల కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానం లో అనేక మార్పులు వచ్చాయి. సామాన్యుడి స్వామి దర్శనానికి పెద్ద పీట వేసారు. అదే సమయంలో వీఐపీల బ్రేక్ దర్శనాలు తగ్గించారు. మరో వైపు అన్నదానంలో మార్పులు తెచ్చారు. నాణ్యత కలిగిన భోజనాన్ని భక్తులకు పెడుతున్నారు. లడ్డూ ప్రసాద క్వాలిటీ పెంచారు. సంప్రదాయ వ్యవసాయ ఉత్పత్తుల పేరుతో కేవలం వీఐపీలకు మాత్రమే పెట్టే ప్రసాదాలను సామాన్యుడి వరకు తెచ్చారు. మరో వైపు దశాబ్దాల కాలంగా ఉన్న చెత్త సమస్యపై సీరియస్‌గా స్పందించారు. పాతుకుపోయిన అధికారులపై చర్యలు తీసుకున్నారు. బ్రహోత్సవాలు విజయవంతంగా నిర్వహించారు. గరుడ సేవ నాడు ఏకంగా మూడు లక్షల మంది భక్తులకు మాడ వీధులలో స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు.అయితే ముగ్గురు అధికారుల నిర్లక్ష్యానికి వీరు అరు నెలలుగా పడిన కష్టం వృథా అయింది. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి టోకన్ల ఇష్యూ సందర్భంగా రామానాయుడు స్కూల్ వద్ద జరిగిన తొక్కిసలాటలో అరుగురు మరణించారు. ఈ ఘటనలో వైఫల్యం క్యూలైన్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలు చూసిన టీటీడీ జేఈఓ అయిన ఐఏఎస్ గౌతమిరెడ్డితో పాటు అక్కడ టీటీడీ ఇన్ చార్జ్ గా ఉన్న డాక్టర్ హరినాథ్ రెడ్డి, డీఎస్పీ రమణ్ కుమార్ నిర్లక్ష్యం అడుగడుగునా కనిపించింది. వీరితో పాటు మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు ఎస్పీ సుబ్బారాయుడు, సీవీ అండ్ ఎస్ఓగా ఉన్న శ్రీధర్ పై బదిలీ వేటు వేశారు.మరో వైపు గతంలో లేని విధంగా ఇప్పుడు తిరుమల ప్రాంతాలలో నిరంతరం రెడ్ శ్యాండిల్ టాస్క్ ఫోర్స్.. అటవీ శాఖలు సంయుక్తంగా రెగ్యులర్ గా కూబింగ్ నిర్వహిస్తుండటంతో పెద్ద ఎత్తున స్మగ్లర్లు బయటపడుతున్నారు..గతంలో లేని విధంగా తనిఖీ లు నిర్వహించడం వల్లనే ఇది జరుగుతుందని అంటున్నారు. గతంలో తిరుమలలో పలుమార్లు గంజాయితో పాటు మాంసం, మద్యం పట్టుబడ్డాయి. అయితే వీటిపై అరోజు ఎవ్వరు మాట్లాడిన వారిపై ఏదో ఒక రంగంగా ప్రతీకార చర్యలు తీర్చుకున్నారు. కేసులు పెట్టి వేధించారు.

మీడియాను సైతం కంట్రోల్ చేయాలని చూశారుచిరుత పులి దాడి విషయంలో జరిగింది కూడా అందరికీ తెలుసు.. క్యూలైన్లలోని భక్తులకు కనీసం అన్న ప్రసాదం కూడా పంపిణీ చేయలేదనే విమర్శలున్నాయి. కరోనా తర్వాత టోకెన్ లేనిదే తిరుమలలోకి ప్రవేశం లేకుండా పోయింది. గోవింద రాజ సత్రాల వద్ద తొక్కిసలాట ఘటనలో పలువురు గాయపడిన తర్వాతనే సర్వ దర్శనానికి అనుమతి ఇచ్చారు. పులి పేరుతో కాలినడకన అలిపిరి మార్గాన వెళ్ళే భక్తులకు టోకెన్స్ అపేసారు. ఇక లడ్డూ రేట్లు పెంచి, క్వాలిటీ తగ్గించారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమలలో జరిగిన తొక్కిసలాట ఘటనను వైసీపీ ఆయుధంగా మలుచుకోవాలని చూసింది. లడ్డూ కౌంటర్ లో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం అన్నది మామూలు వ్యవహారం. దానిపై కూడా వైసీపీ హడావుడి చేసింది. గతంలో వైసీపీ హయాంలోనే లడ్డూ కౌంటర్ల లో సిస్టమ్స్ అపరేషన్ ప్రారంభమైంది. అందుకు సంబంధించి అప్పట్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు ఉన్నారు. అయితే వీటిన్నంటి విషయంలో కూటమి నేతలు మౌనంగా మాట్లాడకుండా ఉన్నారు. జిల్లాలో 13మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంఎల్ సిలు, కార్పొరేషన్ చైర్మన్లు, మరో వైపు ముగ్గురు పార్లమెంటు అధ్యక్షులు, అధికార ప్రతినిధులు ఉన్నారు.ఇంతమంది ఉన్నప్పటికీ వై ఎవ్వరు కనీసం నోరు తెరవడం లేదు.. మాట్లాడితే తిరుపతి జనసేన ఇన్ చార్జ్ కిరణ్ రాయల్ తప్ప మిగతా వారెవ్వరూ వైసీపీ విమర్శలకు కౌంటర్లు ఇవ్వడం లేదు. అయితే వైసీపీ నేతలు మాత్రం ప్రతి రోజు ఏదో ఒక హాడావుడి చేస్తూ అటు కూటమి ప్రభుత్వం, ఇటు టీటీడీ బోర్డుపై ధ్వజమెత్తుతూనే ఉన్నారు. తమ మీడియాతో పాటు అనుబంధ మీడియా, ఇతర గ్రూపులలో పెద్ద ఎత్తున సోషియల్ మీడియాలో కొండపై పాపాలు జరిగిపోతున్నాయని విమర్శలు గుప్పిస్తున్నారు.

వైసీపీ విమర్శలు చేస్తున్నా కూటమి నాయకులు పట్టుపట్టనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. తిరుపతి టీడీపీ నేతలు అయితే తమకు పదవులు లేవు.. కనీసం గుర్తింపు కూడా లేనప్పుడు ఎందుకు మాట్లాడాలి అంటున్నారంట. ఎమ్మెల్యేలు కూడా ఎవరూ నోరు విప్పడం లేదు. సీనియర్ నేత అమర్‌నాథ్ రెడ్డి సైతం మౌనంగానే ఉంటున్నారు.

విపక్షం విమర్శలకు కౌంటర్లు ఇవ్వాల్సిన కూటమి నేతలంతా మనకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండటం మిత్రపక్షాల కేడర్‌కు మింగుడుపడటం లేదంట. ఇది ఇలాగే కొనసాగితే కార్యకర్తలలో అత్మవిశ్వాసం సన్నగిల్లుతుందని ముఖ్యంగా తిరుపతి లాంటి కీలకమైన చోట పార్టీ కి దిక్కూ దివాణం లేకుండా పోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# జగన్ జన్నాల్లోకి వచ్చేది ఎప్పుడు

నెల్లూరు, జనవరి 21, వైసీపీ అధినేత వైఎస్ జగన్ జనవరి మూడో వారం నుంచి జిల్లాల పర్యటనలు చేస్తానంటూ ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఇంత వరకూ జగన్ దానికి సంబంధించిన అప్ డేట్ ఇవ్వలేదు. జగన్ ఇంకా లండన్ లోనే ఉన్నారు. ఆయన వచ్చి ఎప్పుడు జిల్లాల పర్యటనలు చేస్తారన్న దానిపై నేతలకు కూడా క్లారిటీ లేదు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఎనిమిది నెలలు దాటుతుంది. అయితే ఈ ఎనిమిది నెలల కాలంలో కీలక నేతలు పార్టీని వీడి పోయారు. జగన్ బాగా నమ్మి దగ్గర తీసిన వ్యక్తులే దూరమయ్యారు. బాలినేని శ్రీనివాసులురెడ్డి, సామినేని ఉదయ భాను, కిలారు రోశయ్య ఇలా ఒక్కరేమిటి నిన్నటి నిన్న పార్టీ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి కూడా పార్టీని వీడారు.. జగన్ తాడేపల్లి ఇంట్లోనో, బెంగళూరులోనో ఉంటే ఇక నేతలు మిగలరన్నది పార్టీ నేతల అభిప్రాయం. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ అనేక మంది నేతలు వెళ్లిపోతున్నా వారిని పట్టించుకోలేదు. అవంతి శ్రీనివాసరావు, ఆళ్లనాని, గ్రంధి శ్రీనివాస్ లు పార్టీని వదిలి వెళుతున్నా పట్టించుకోలేదు. తర్వాత నేతలకు తాను అవకాశం ఇవ్వాలని జగన్ భావించి ఉండవచ్చు. కానీ ఆ స్థాయి నేతలు వైసీపీకి ఎంత మేరకు దొరుకుతారన్నది ఇప్పుడు ప్రశ్న. జనంలో లేకుండా ఇంట్లోనో, కార్యాలయంలోనో కూర్చుంటే క్యాడర్ లో ఎలాంటి ధైర్యం ఉండదు. వారు కూడా ఇప్పటికే డీలా పడిపోయారు. నేతలే వెళ్లిపోతుంటే ఇక కార్యకర్తలు బయటకు వచ్చి ఆందోళన కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటారన్న ప్రశ్నకు అధినేత నుంచి సమాధానం లేదు. జిల్లా నేతలతో సమావేశాలను తాడేపల్లి పార్టీ ఆఫీసులో పెట్టి తాను జనవరి మూడోవారంలో జిల్లాల పర్యటన చేస్తానని ప్రకటించడంతో ఎక్కువ మంది ఆశలు పెట్టుకున్నారు. జనంలో ఉంటే కొంత పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని ఆశిస్తున్నారు. ఇప్పటికే పార్టీలో ఉన్న నేతలు కూడా యాక్టివ్ గా లేరు. ఎవరో ఒకరిద్దరు మినహా నేతలందరూ దాదాపు మౌనంగానే ఉన్నారు. వారందరూ యాక్టివ్ కావాలంటే తిరిగి తమ పార్టీ అధినేత జగన్ జనంలోకి రావడమే పరిష్కారం అని క్యాడర్ భావిస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఎనిమిది నెలలు కావస్తున్నా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్న విషయాన్ని ప్రజలకు తెలియజెప్పడంలో వైసీపీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది వైసీపీ సోషల్ మీడియా సయితం పూర్తిగా సైలెంట్ అయిపోయింది. ఇటు మీడియా మద్దతు లేక, జగన్ జనంలోకి రాక పార్టీ ఎలా బలోపేతం అవుతుందని కొందరు సీనియర్ నేతలు ప్రశ్నిస్తున్నారు. జనవరి మూడో వారంలో వస్తానని ప్రకటించడం ఎందుకు? తర్వాత రాకుండా ఆయన దానిని దాటవేయడం ఎందుకు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన వెంటనే చంద్రబాబు ఒక్కరే జిల్లాల పర్యటనకు వెళ్లారు. అనేక కార్యక్రమాలతో ప్రజల వద్దకు వెళ్లి వారికి ప్రజల వైఫల్యాలను చెప్పగలిగారు. దీంతోనే 2024లో ఆయనకు సక్సెస్ దక్కిందన్నది వాస్తవం. మరి జగన్ కు ఏమయింది? ఎందుకిలా పార్టీని ఇలా గాలికి వదిలేశారన్నది నేతలకే అర్థం కాకుండా ఉంది

# ఎయిర్ అంబులెన్స్, కార్... రెడీ

ముంబై, జనవరి 21, (న్యూస్ పల్స్) ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ఆటో రంగ కంపెనీలు అనేక కార్లు, స్కూటర్లు, సోలార్ ఈవీలను విడుదల చేశాయి. ఇంకా మరిన్ని కార్లను ప్రవేశపెట్టనున్నాయి. కానీ వీటన్నింటి మధ్య ఏరోస్పేస్ స్టార్టప్ కంపెనీ సరళా ఏవియేషన్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇండియా ఎక్స్‌పోలో కంపెనీ ప్రోటోటైప్ జీరో ఎయిర్ టాక్సీని ప్రవేశపెట్టింది. దీనిపై అభిమానుల్లో చాలా చర్చ జరుగుతోంది. ఈ టాక్సీ ప్రత్యేకత ఏమిటో ఈ కథనంలో చూద్దాం.చెందిన సరళ ఏవియేషన్ కంపెనీ ఎయిర్ టాక్సీ ని ఆవిష్కరించింది. ఈ టాక్సీ గంటకు 250 కి.మీ వేగంతో ప్రయాణించగలదు. ఇది తక్కువ దూర ప్రయాణాలకు మాత్రమే అని కంపెనీ తెలిపింది. ఇది 30 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. గరిష్టంగా 680 కిలోల భారాన్ని మోయగలదు.సరళా ఏవియేషన్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో అడ్రియన్ ష్మిత్ మాట్లాడుతూ.. జీరో అనేది కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాదు. భారతదేశంలో పట్టణ చలనశీలతను పునర్నిర్వచించాలనే మా దార్శనికతను ఇది ప్రతిబింబిస్తుంది. దీని కారణంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లోని ప్రజలు తక్కువ దూరం ప్రయాణించడానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సిన అవసరం ఉండదు. ఒకేసారి ఆరుగురు ప్రయాణికులు ప్రయాణించగలుగుతారు. 2028 నాటికి బెంగళూరులో ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ టాక్సీలను ప్రారంభించాలని కంపెనీ యోచిస్తోందిసరళా ఏవియేషన్‌ను అక్టోబర్ 2023లో అడ్రియన్ ష్మిత్, రాకేష్ గావోంకర్, శివం చౌహాన్ స్థాపించారు. ఈ స్టార్టప్ ఇటీవల యాక్సెల్ నేతృత్వంలోని సిరీస్ ం నిధులలో 10 మిలియన్ అమెరికన్ డాలర్లను సేకరించింది. ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు బిన్నీ బన్సాల్, జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ కూడా పాల్గొన్నారు. ఈ కంపెనీకి భారతదేశపు మొట్టమొదటి మహిళా పైలట్ సరళా థక్రాల్ పేరు పెట్టారు.బెంగళూరు తర్వాత ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో కూడా తమ ప్రాజెక్టును ప్రారంభిస్తామని సరళ ఏవియేషన్ తెలిపింది. ఇది కాకుండా తక్షణ వైద్య సేవలను అందించడానికి కంపెనీ ఉచిత అంబులెన్స్ సేవను ప్రారంభిస్తుంది.

# యువత ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

హైదరాబాద్ ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు అన్నింటిని వినియోగించుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆర్ వన్ గ్లోబల్ కన్సల్టెన్సీ సర్వీసెస్, ఆస్ట్రేలియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా కూకట్పల్లి లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విదేశాలలో ఆతిథ్య సేవలకై (హాస్పిటాలిటీ) ప్రత్యేక కోర్సు , మేనేజ్మెంట్ కోర్సులు నిర్వహిస్తూ హైదరాబాదులో సేవలందిస్తున్న ఆర్ వన్ గ్లోబల్ హాస్పిటల్ సర్వీసెస్ సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి సదవకాశాలను ఉపయోగించుకొని సంస్థ ద్వారా శిక్షణ పొంది పలు దేశాలను సేవలందించి ఉపాధి పొందాలన్నారు. ఇలాంటి అవకాశాలను వినియోగించుకోకపోవడం మన తప్పే అవుతుందన్నారు. హాస్పిటా లిటి తో పాటు రిటైల్ బిజినెస్ అమ్మకాలు మార్కెటింగ్ కమ్యూనికేషన్ రిక్రూమెంట్ ప్రయాణ రంగాలలో కూడా విద్యార్థుల నైపుణ్యాన్ని బట్టి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఆర్ వన్ గ్లోబల్ సర్వీసెస్ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వృత్తిపరమైన అవకాశాలు కల్పించేందుకు శక్తిసామర్థ్యాలను ఏర్పాటు చేస్తుందని ఆర్ వన్ గ్లోబల్ సర్వీసెస్ డైరెక్టర్ నాగేశ్వరావు అన్నారు.

# నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు వర్ధంతి నేడు

అక్కినేని నాగేశ్వరరావు తెలుగు నటుడు, నిర్మాత. వరి చేలలో నుండి, నాటకరంగం ద్వారా కళారంగం లోకి వచ్చిన వ్యక్తి. తెలుగు సినిమా తొలినాళ్ళ అగ్రనాయకులలో ఒకడు. నాటకాలలో స్త్రీ పాత్రల ద్వారా ప్రాముఖ్యత పొందాడు. అతడు నాస్తికుడు.

ప్రముఖ చిత్రనిర్మాత ఘంటసాల బలరామయ్య విజయవాడ రైల్వే స్టేషన్లో అక్కినేనిని చూసాడు. ఆ తరువాత సినిమాలకు పరిచయం చేసాడు. ధర్మపత్ని సినిమాతో అతడి సినీజీవితానికి తెరలేచింది. అప్పటినుండి రకరకాల తెలుగు, తమిళ సినిమాలలో 75సంవత్సరాల పైగా నటించాడు. ఎన్. టి. ఆర్ తో పాటు తెలుగు సినిమాకి మూల స్తంభంగా గుర్తించబడ్డాడు.

మూడు ఫిల్మ్ ఫేర్ తెలుగు అత్యుత్తమ నటుడు పురస్కారాలు అందుకున్నాడు. భారతీయ సినిరంగంలో చేసిన కృషికి దేశంలో పౌరులకిచ్చే రెండవ పెద్ద పురస్కారమైన పద్మ విభూషణ్తో పాటు భారత సినీరంగంలో జీవిత సాఫల్య పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందాడు.

అక్కినేని నాగేశ్వరరావు కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నందివాడ మండలం రామాపురంలో 1924 సెప్టెంబర్ 20 న అక్కినేని వెంకటరత్నం, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. చిన్ననాడే నాటకరంగం వైపు ఆకర్షితుడై అనేక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించాడు. అక్కినేనితో అన్నపూర్ణ వివాహం 1949 ఫిబ్రవరి 18న జరిగింది. ఆమె పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో 1933 ఆగస్టు 14న జన్మించింది. వారికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు –అక్కినేని వెంకట్, నాగార్జున, సత్యవతి, నాగ సుశీల, సరోజా. భార్య పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించాడు. అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్ ద్వారా, కుమారుడు అక్కినేని నాగార్జున, మనవళ్లు సుమంత్, అఖిల్ సహా పలువురు నటీనటుల్నీ, దర్శకుల్నీ పరిచయం చేశాడు.

అక్కినేని నాగేశ్వరరావు 91 సంవత్సరాల వయసులో 2014, జనవరి 22 న మరణించాడు. అర్థరాత్రి దాటాక ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబసభ్యులు 2.45 గంటల సమయంలో బంజారాహిల్స్ లోని కేర్ ఆసుపత్రి తీసుకువెళ్ళారు. పదినిమిషాలకే వైద్యుల బృందంతో పరిశీలించగా మృతిచెందారని నిర్ధారణ అయింది.

# హైద్రాబాద్ సంస్థాన విమోచనానికి పాటు పడ్డ మహానాయకుడు స్వామి రామానంద తీర్థ

## –నేడు ఆయన వర్ధంతి

స్వామి రామానంద తీర్థ స్వాతంత్ర సమరయోధుడు, హైద్రాబాద్ సంస్థాన విమోచనానికి పాటు పడ్డ మహానాయకుడు, భారత పార్లమెంట్ మాజి సభ్యుడు, సన్యాసి, కార్మిక నాయకుడు, విద్యావేత్త.

ఈయన అసలు పేరు వెంకటరావు ఖేడ్గీకర్. తండ్రి భాపూరావు, తల్లి యసుబాయి.1903 అక్టోబరు 3వ తేదీన అప్పటి హైదరాబాదు సంస్థానంలోని గుల్బర్గా జిల్లా, ఝువర్గీ తాలూకా సింద్గీ గ్రామంలో ఆయన జన్మించారు. ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉండగానే 1920 జూలై 31 వ తేదీ రాత్రి లోకమాన్య బాలగంగాధర తిలక్ కాలధర్మం చెందారన్న వార్త విని బ్రహ్మచారిగా తన జీవితాన్నంతా మాతృభూమి సేవకే అంకితం చేయగలను అని ప్రతిజ్ఞ చేసి, ఆ ప్రకారమే ఉండిపోయిన ధీరోధాత్తుడు ఆయన. కళాశాల చదువుకు స్వస్తి చెప్పి, పూనాలోని తిలక్ విద్యాపీఠ్‌లో మూడేళ్ళు అధ్యయనం చేసి, ప్రజాస్వామ్యం, దాని క్రమాభివృద్ధి అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి పూనా విశ్వవిద్యాలయానికి సమర్పించి ఎం.ఏ పట్టాని పొందారు.

తొలుత కార్మిక రంగంలో పనిచేసి, కారాగార శిక్ష అనుభవించి ఆరోగ్యం అనుకూలించక, మరాఠ్వాడాలో ఉస్మానాబాదు జిల్లాలోని హిప్పర్గిలో నెలకొల్పబడిన జాతీయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులై, ఆరు సంవత్సరాలపాటు ఆ విద్యా సంస్థను గురుకుల పద్ధతిపై చక్కగా ఆయన నిర్వహించారు. 1932లో స్వామి నారాయణ అనే గురువు వీరికి 'విద్వత్ సన్యాసం ' అనే పద్ధతి ప్రకారం సన్యాస దీక్ష ఇచ్చి, ఈయనకు 'స్వామీ రామానంద తీర్థ' అని నామకరణం చేశారు. 1938లో రాజకీయరంగంలోకి ప్రవేశించి ఆయన మహారాష్ట్ర పరిషత్తుకు కార్యదర్శిగా పనిచేసి, ఆ సంవత్సరమే తన నివాసాన్ని మోమినాబాదు నుంచి హైదరాబాదుకు ఆయన మార్చారు. స్టేట్ కాంగ్రెస్ అనే సంస్థను నెలకొల్పడానికి స్వామిజీ ప్రయత్నం చేస్తుండగా, స్టేట్ కాంగ్రెస్ సంస్థను నిజాం ప్రభుత్వం 1938 సెప్టెంబర్లో నిషేధించింది.ఆ నిషేధాజ్ఞలకు నిరశనగా స్వామి రామానంద తీర్థ హైదరాబాదులో 1938 అక్టోబరు 27వ తేదీన సత్యాగ్రహం చేయగా ప్రభుత్వం ఆయన్ను బంధించి, 18 నెలలు కఠిన శిక్షనములుచేశారు. స్టేట్ కాంగ్రెస్ సంస్థపై నిషేధం తొలగించని కారణంగా, తాను వ్యక్తిగత సత్యాగ్రహం చేస్తానని స్వామీజీ అప్పటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి తెలియచేయగా, 1940 సెప్టెంబర్ 11 వ తేదీన ఆయనను బంధించి, ప్రజారక్షణ నిబంధనల క్రింద నిజామాబాద్ కారాగారంలో నిర్బంధంలో ఉంచారు.1942-1950 సంవత్సరాల మధ్య హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు.దేశీయ సంస్థానాల మహాసభ కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగస్ట్‌లో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింపబడ్డ బొంబాయి కాంగ్రెస్ సభలో పాల్గొని షోలాపూర్ నుంచి వీరు తిరిగిరాగానే ఆయనను నిజాం ప్రభుత్వం బంధించి1943 డిసెంబరులో విడుదల చేసింది.

హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని ఉద్యమాన్ని ప్రారంభించినందుకు ఆయనను 1948 జనవరిలో బంధించి, అనేక జైళ్ళల్లో ఉంచారు. నిజాం సైన్యం భారత ప్రభుత్వ సైన్యానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17వ తేదీన రామానంద తీర్థ స్వామి నిర్బంధం నుండి విడుదల పొందారు.రామానంద తీర్థ నాందేడ్‌లోని పీపుల్స్ కాలేజి వ్యవస్థాపకులు .హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులుగాను, 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగాను ఆయన పనిచేశారు.

1952 నుండి 1962 వరకు లోకసభ సభ్యులుగా ఉన్నారు.1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు స్వామీజీ ఆహ్వానసంఘాధ్యక్షులుగా వ్యవహరించారు. హైదరాబాదు సంస్థానాన్ని భాషా ప్రాతిపదికపై విభజించాలని 1953లోనే గట్టిగా కోరిన స్వామీజీ ఎనిమిది తెలంగాణా జిల్లాలను మద్రాసు రాష్ట్రం నుండి విడిపడ్డ ఆంధ్ర ప్రాంతంలో కలిపేసి తెలుగు ప్రజల చిరకాల వాంఛయైన విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని ఒక ప్రకటన చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ పౌరుడుగానే హైదరాబాదులో నివాసమేర్పరు చుకొన్నారు.1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభాజీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూత నిచ్చారు. స్వామిజి 1972 జనవరి 22 వ తేదీన హైదరాబాదులో నిర్యాణం చెందారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



తిరుమల పది రోజులపాటు తిరుమలలో జరిగిన వైకుంఠ ద్వార దర్శనాలు ఆదివారం అర్ధరాత్రితో ముగిశాయి. సోమవారం వేకువజాము నుంచి సాధారణ దర్శనాలు మొదలయ్యాయి. కాగా, పది రోజుల్లో 6,83,304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని, వైకుంఠ ద్వార ప్రవేశం చేశారు. హుండీ ద్వారా రూ.34.43 కోట్ల ఆదాయం లభించింది. సంక్రాంతి సందర్భంగా 14వ తేదీ అత్యధికంగా 78 వేల మంది శ్రీవారిని దర్శించుకోగా, రెండవరోజు ద్వాదశి రోజున అతితక్కువగా 53,013 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, పెరిగిన రద్దీ నేపథ్యంలో సోమవారం దర్శనానికి సంబంధించి తిరుపతిలో జారీ చేసే స్లాటెడ్ సర్వదర్శనాలను టీటీడీ రద్దు చేసింది. దీంతో టోకెన్రహిత దర్శనాలు జరిగాయి.

## జలాల్ పూర్ గ్రామసభలో పాల్గోన్న ఎమ్మెల్యే కుంభం

యాదాద్రి భువనగిరి యాదాద్రి జిల్లా పోచంపల్లి మండలం జలాల్ పూర్ గ్రామంలో మొదటి గ్రామ సభలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గోఎన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చాలా వరకు గ్రామాల్లో ప్రభుత్వం తీసుకోవచ్చునా సంక్షేమ పథకాలకు అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోకపోవడంతో ప్రభుత్వం దృష్టికి వచ్చిందని అందుకే గ్రామ సభలు ఏర్పాటు చేసి తిరిగి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.

# సౌత్ సొమ్ములతో నార్త్... సోకులు

జనాభా తగ్గడం వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు సమీప భవిష్యత్ లో చాలా రకాలుగా నష్టాలు, సవాళ్లు ఎదురవబోతున్నాయి. ఇక్కడి వ్యాపార గ్యాప్, ఉద్యోగాల గ్యాప్ ను ఉత్తరాది రాష్ట్రాలు ఫిలప్ చేసే ఛాన్సెస్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే అది చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ప్లంబింగ్ దగ్గర్నుంచి హౌస్ కన్స్ట్రక్షన్, ఐటీ దాకా నార్త్ జనమే సౌత్ లో పెరుగుతున్నారు. ఇక సౌత్ స్టేట్స్ లో వ్యాపారాలు చేసేందుకు రాజస్థాన్, యూపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వలస వస్తున్నారు. మంచి పొజిషన్ కు వెళ్తున్నారు. కారణం ఇక్కడ భారీ గ్యాప్ ఉండడమే. వాళ్ల రాష్ట్రాల్లో పోటీ ఎక్కువుండడం, జనాభా ఎక్కువుండడంతో సౌత్ కు తరలి వస్తూనే ఉన్నారు.రైట్ ఈ ఏడాది జనగణన జరగబోతోంది. ఇది 2026 దాకా కొనసాగుతుంది. ఆ లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన ఉండబోతోంది. అంటే జనం ఎక్కడ ఎక్కువుంటే అన్నేసి నియోజకవర్గాలు పెరుగుతాయన్న మాట. అదే జరిగితే జనం తక్కువగా ఉన్న సౌత్ లో నియోజకవర్గాల్లో పెద్దగా మార్పు ఉండదు. అదే టైంలో నార్త్ లో ముఖ్యంగా యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి చోట్ల విపరీతమైన జనాభాతో ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంటుంది. సీట్లు ఒక్కటే కాదు? నిధుల పంపిణీ కూడా జనాభా ఆధారంగానే జరుగుతుంది. ఇప్పుడు కూడా అలాగే నడుస్తోంది. అందుకే సౌత్ స్టేట్స్ చాలా టెన్షన్, అటెన్షన్ తో ఉన్నాయి. కేంద్రం నుంచి అందాల్సిన నిధులపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయజనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని, దక్షిణాది-ఉత్తరాది అనే చర్చ వచ్చే ఆస్కారం ఉంది కాబట్టి కేంద్ర ప్రభుత్వమే దీనికి స్పష్టమైన విధాన రూపకల్పన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటి నుంచో చెబుతున్నారు. దేశ జనాభాలో సౌత్ స్టేట్స్ 18 శాతమే ఉన్నా.. జీడీపీలో వాటా 35శాతంగా ఉంది. అంతెందుకు తలసరి ఆదాయం విషయంలో జాతీయ సగటు కంటే దక్షిణాది రాష్ట్రాలే టాప్. కానీ ఏం లాభం? కేంద్ర నిధుల పంపిణీ మాత్రం జనాభా ఎక్కువున్న రాష్ట్రాలకే ఎక్కువ అన్న ఫార్ములా టోటల్ గా ఎఫెక్ట్ చూపుతోంది.1 970ల్లో కేంద్ర ప్రభుత్వం జనాభా నియంత్రణ కార్యక్రమాలు చేపట్టింది. వీటిని సౌత్ స్టేట్స్ పక్కాగా అమలు చేసి అభివృద్ధికి బాటలు వేశాయి. కానీ ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను కంట్రోల్ చేయలేకపోయాయి. అదుపు చేసుకోకుండా పెంచుకుంటూ వెళ్లాయి. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోంది. జనాభాను నియంత్రించుకుని ఇప్పుడు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. జన సంఖ్య అదుపు చేసుకోలేకపోయిన ఉత్తరాది రాష్ట్రాలు లాభపడే సీన్ ఏర్పడింది. అందుకే జనాభా ప్రాతిపదికన నిధుల బట్వాడా కాకుండా ఆర్థికంగా మంచి పర్ఫార్మెన్స్ చూపే ఆధారంగా ఇవ్వాలంటున్నారు. అది జరగాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కు సవరణ చేయడం ద్వారా దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోకుండా కొత్త ఫార్ములా తీసుకురావాలి. కానీ ఇది చేసేదెవరు? దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల వాదన వినేదెవరన్న చర్చ జరుగుతోంది.. జనవరి నెలకు గానూ కేంద్రపన్నుల్లో రాష్ట్రాల వాటాను ఎలా పంచిందో? మొత్తం లక్షా 73 వేల 30 కోట్లను 28 రాష్ట్రాలకు డిస్ట్రిబ్యూట్ చేసింది. ఇందులో బిమారూ స్టేట్స్ అని నాలుగు రాష్ట్రాలకు పేరుంది. అవి బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్. ఇందులో బిహార్ కు ఏకంగా 17 వేల 403 కోట్లు, మధ్యప్రదేశ్ కు 13,582 కోట్లు, రాజస్థాన్ కు 10 వేల 426 కోట్లు, ఇక ఉత్తరప్రదేశ్ కు ఏకంగా 31 వేల 39 కోట్లు పంచింది కేంద్రం. ఇది 2025 జనవరి పన్నుల వాటా లెక్కలు. ఇందులో టాప్ త్రీలో బిమారూ రాష్ట్రాలైన యూపీ, బిహార్, మధ్యప్రదేశే ఉన్నాయి. మరి ఆ రాష్ట్రాల నుంచి కేంద్రానికి వెళ్లింది గోరంత. తీసుకున్నవి కొండంత.నిన్న మొన్నటిదాకా భారత్ కు యువతే బలం, యువశక్తి ఎక్కువున్న దేశం అంటూ అంతా మాట్లాడుకునే వారు. కానీ ఇప్పుడు అది తగ్గుతోంది. ఇకపైనా తగ్గుముఖమే పడుతుందని పరిస్థితులు చెబుతున్నాయి. అందుకే గతంలో జనాభా నియంత్రణ అన్న వారే ఇప్పుడు కనండి బాబూ కనండి అంటున్నారు. కథ మార్చాల్సిన టైం వచ్చిందంటున్నారు. లేకపోతే పెను నష్టం తప్పదంటున్నారు. జనాభా పెరగకపోతే నిజంగానే అంత పెద్ద నష్టం ఉందా?జనాభా లెక్కల విషయంలో చైనా నుంచి మొదలు పెడుదాం. ఒకప్పుడు చైనా ప్రపంచంలోనే ఎక్కువ జనాభా ఉన్న దేశంగా ఉండేది. కానీ భారత్ దాన్ని అధిగమించింది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు వరుసగా మూడో ఏడాది చైనాలో జనాభా తగ్గిపోయినట్లు లెక్కలు రిలీజ్ చేసింది. దీంతో అక్కడ భయాలు పెరుగుతున్నాయి. ఎందుకంటే ఓవైపు వృద్ధుల జనసంఖ్య పెరుగుతోంది. అదే సమయంలో పని చేసే యువత సంఖ్యలో తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది. చైనా ఒక్కటే కాదు తూర్పు ఆసియాలో, జపాన్, సౌత్ కొరియా, హాంకాంగ్ లోనూ జనాభా పడిపోయింది. ఇందుకు కారణం పెరుగుతున్న ఖర్చులు, విద్య, ఉద్యోగం అనే సరికి పెళ్లిళ్లు, ఆ తర్వాత సంతానాలు వాయిదా పడుతున్నాయి. చైనాకు బలం ఆ దేశ జనాభానే. ప్రపంచంలో ప్రస్తుతం రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఇది ఫస్ట్ ప్లేస్ కు రాకముందే వృద్ధుల సంఖ్య పెరిగి రివర్స్ అవుతుందన్న భయాలు వారిని వెంటాడుతున్నాయి. 2100 నాటికి చైనా జనాభా 73 కోట్లు ఉంటుందన్న అంచనాలు ఆ దేశ ఆర్థికవ్యవస్థకు పెను సవాళ్లే.ఇప్పుడు మనదేశం విషయానికొద్దాం. కొన్ని రాష్ట్రాల్లో విపరీతంగా జనాభా ఉంటే ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం తగ్గుతోంది. సో ఆటోమేటిక్ గా జనాభా ఎక్కువున్న రాష్ట్రాల్లో విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు లేని వారంతా దక్షిణ భారత రాష్ట్రాలకు విపరీతంగా వలస వస్తున్నారు. ఇక్కడున్న జనాభా గ్యాప్ ను వలసలతో ఫిల్ చేస్తున్నారు. ఇది శాశ్వత పరిష్కారం కాదు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా సౌత్ ఇండియన్ స్టేట్స్ కట్టుదిట్టంగా ఆ రూల్ ను ఫాలో అయ్యాయి. ఇంటికి ఒకరు లేదా ఇద్దరి వరకే సంతానాన్ని సరిపెట్టారు. కానీ ఇప్పుడు అలాగే ఉంటే కుదిరే పరిస్థితి కనిపించడం లేదు. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు ప్రతి సందర్భంలోనూ ఇదే మాట మాట్లాడుతున్నారుజనాభానే అసలైన ఆస్తి అన్నది ప్రస్తుతం డౌన్ ట్రెండ్ లో ఉన్న చైనా ఆందోళన చూస్తే అర్థమవుతోంది. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆందోళన చూస్తే అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే జనాభా లేకపోతే ఏ పనీ చేయలేని పరిస్థితి. సంపద సృష్టి, మ్యాన్ పవర్ జెనరేషన్ ఇవన్నీ తగ్గి మ్యాటర్ లేకుండా పోతుంది. ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధనను కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి ఏపీలో తీసుకొచ్చారు. కానీ ఇప్పుడు దాన్ని తీసేస్తామని పిల్లలు లేని వారికి పోటీకి అనర్హత విధిస్తామంటున్నారు చంద్రబాబు.భారత జనాభా 2060ల నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, ఆ తర్వాత అది క్రమంగా తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఒక్కరిద్దరినే కనాలి. వారికి మంచి చదువు, మంచి ఆరోగ్యం, మంచి భవిష్యత్ కల్పించేలా చూసుకోవాలన్న కాన్సెప్ట్ తో చాలా మంది ఉంటున్నారు. ఇవాళ్టి రోజుల్లో కాస్ట్ ఆఫ్ లివింగ్ చాలా పెరిగింది. ఎంత సంపాదించినా డైలీ ఖర్చులకే సరిపోతుండడంతో మధ్యతరగతి జనం చాలా వరకు ఒకరిద్దరు సంతానంతోనే సరిపెడుతున్నారు. ఈ రోజుల్లో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మందిని కనేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే ఆ స్థాయి ఖర్చులను భరించే స్తోమత ఉండడం లేదు. కానీ ఇది దేశానికే అందులోనూ సౌత్ ఇండియాకు పెద్ద ఎత్తున నష్టం కలిగించే పరిణామంగా మారుతోందిజనాభా పెరుగుదల విషయంలో ఇప్పుడు కొత్త విషయాలు బయటికొస్తున్నాయి. ఈ ఏడాది జనగణన జరిగే అవకాశం ఉంది. ఆ ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులు ఉండబోతున్నాయి. దాంతో దేశానికి ఎక్కువ సంపాదించి పెడుతున్న దక్షిణాది రాష్ట్రాలైనా ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక విపరీతంగా నష్టపోయే ముప్పు ఎదుర్కొంటున్నాయి. అందుకే జనాభా పెంచాలని చంద్రబాబు, స్టాలిన్ అంటున్నారు. మరోవైపు జనాభా ప్రకారం కాకుండా రాష్ట్రాల పన్నుల వాటా ఆధారంగా నిధుల డిస్ట్రిబ్యూషన్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వాదిస్తున్నారు.

## నుమాయిష్ లో పార్కింగ్ దోపిడి

### ఎమ్మెల్యే రాజా సింగ్




హైదారబాద్ సిటీ నుంచి ఎగ్జిబిషన్ ను బయటికి పంపాలాన్నారు గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్. ఇక్కడ జరుగుతుంది మొత్తం స్కామే. ప్రభుత్వ స్థలం లో పార్కింగ్ పెట్టిన కుడా కారుకి 150 రూపాయలు బైక్ కి 60 రూపాయలు వసూలు చేస్తున్న పార్కింగ్ గుండాలని అన్నారు. ఎగ్జిబిషన్ ఎంట్రీ ఫీస్ 50 రూపాయిలు ఉంటే దాని కన్నా ఎక్కువ రేట్ పార్కింగ్ ఫీస్ వసూలు చేస్తున్నారని జనాలు వాపోతున్నారు. ఇది చాలా దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిటీకి బయట 100 ఎకరాల్లో ఎగ్జిబిషన్ పెట్టండి అని ప్రభుత్వాన్ని కోరారు రాజా సింగ్.
45 రోజుల జరిగే ఎగ్జిబిషన్ వల్ల జనాలకి ఎంత ఇబ్బంది కలుగుతుంది. ట్రాఫిక్ జామ్ వలన ఎంతో వేలాది మండి ఇబ్బంది పడుతున్నారు. రేవంత్ రెడ్డి ఎగ్జిబిషన్ ని ఇక్కడి నుంచి ట్రాన్స్ఫర్ చేయండని అన్నారు.

## గుట్ట ఒకటో వార్డులో గ్రామసభ

యాదాద్రి భువనగిరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా సర్వేపై యాదగిరిగుట్ట పట్టణంలో ఒకటో వార్డులో గ్రామ సభ ఏర్పాటు చేశారు. వార్డులో ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డు రానివారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ సుధా తెలిపారు.ఈ గ్రామసభలోమున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు...

## పటాన్ చెరు ఎమ్మెల్యేకి చేదు అనుభవం

పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి చేదు అనుభవం ఎదురయింది. బొల్లారంలో రోడ్డు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వెళ్లారు. అక్కడ స్థానిక కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డిని అడ్డుకున్నారు. మంత్రి దామోదర తో రోడ్డు ప్రారంభించాలి అనుకుంటే ఎమ్మెల్యే ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే అనుచరుల వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసారు.

## హుస్నాబాద్ గ్రామసభల్లో రగడ

సిద్దిపేట హుస్నాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజా పాలన వార్డు సభలు జరిగాయి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులలో పేర్లు రాలేదని పలు వార్డుల్లో కొంతమంది వార్డు ప్రజలు ఆందోళనకు దిగారు.ఓకే కుటుంబంలో ఇద్దరికీ, స్థానికంగా లేనివారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇందిరమ్మ ఇండ్ల విషయమై బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య కాసేపు గొడవ జరిగింది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు లలో పేర్లు రానివారు వార్డు సభలో దరఖాస్తు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్, చైర్మన్ సద్ది చెప్పడంతో అందోళన సద్దుమణిగింది.

## మానసిక ఒత్తిడి నీ తగ్గించేది చాక్లెట్

### రచయిత యండమూరి వీరేంద్రనాథ్

హైదరాబాద్ మానసిక ఒత్తిడిని తగ్గించే విధంగా చాక్లెట్లను తయారు చేయడం అభినందనీయమని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 లోని దసపల్ల హోటల్ లో హెటాఫీ డైమండ్ క్యాండి నీ ఆయన ప్రముఖ వైద్యురాలు పద్మశ్రీ మంజుల అనగాని తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్లో ఆరోగ్యాలను పాడుచేసే, చెడగొట్టే ఆహార పదార్థాలు తయారవుతున్నాయని అలాంటివి కాకుండా ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా ఇష్టంగా తినే చాక్లెట్లను ఆరోగ్యాలను పాడు చేసే విధంగా కాకుండా మెరుగుపరిచే విధంగా తయారు చేయడం నిజంగా అభినందనీయం అన్నారు. హెటాఫీ క్యాండీ అధినేత ఎస్. సృజన్ మాట్లాడుతూ ప్రధాని మోడీ మేక్ ఇన్ ఇండియా పిలుపు మేరకు ప్రపంచ స్థాయి చాక్లెట్ లను దేశం మొత్తం అందించేందుకు ఉత్పత్తి చేస్తున్నామని అన్నారు. కాన్ఫెక్షనరీ రంగంలో స్వదేశీ ఉత్పాదనగా ఇప్పటికే హెటాఫీ క్యాండీ గుర్తింపు పొందిందని అన్నారు. ఈ క్యాండీ పై క్లినికల్ ట్రయల్స్ జరిగి యూఎస్ఏ నుంచి ఎఫ్డీయే అప్రూవల్ కూడా పొందిందని తెలిపారు.
ప్రతిరోజు ఓ క్యాండీ తినే వాళ్ళకి గ్యాస్ట్రిక్, బ్లోటింగ్ వంటి సమస్యలు తొలగిపోతాయని అన్నారు.

## పదవ తరగతి విద్యార్థనిపై లైంగిక దాడి

రాయచోటి అన్నమయ్య జిల్లా రాయచోటిలో దారుణం జరిగింది. పదో తరగతి చదువుతున్న బాలిక పై ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్ లైంగిక దాడి చేసాడు. దాంతో సదరు విద్యార్థిని గర్భం దాల్చింది. ఏడవ నెలలో ఓ ప్రవేటు ఆస్పత్రి లోని ఓ నర్సు సాయంతో అబార్షన్ చేయించాడు విజయ్ కుమార్. బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు విజయ్ కుమార్ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

## కడప జిల్లా ఎస్పీగా అశోక్ కుమార్

### నాడు డీఎస్పీగా పని చేసిన చోటే ఇప్పుడు ఎస్పీ

### అప్పట్లో రౌడీ షీటర్ల పై ఉక్కు పాదం



బద్వేలు ఉపాధ్యాయుడుగా పనిచేసి బెత్తం పట్టుకొని విద్యార్థులను బావి భారత పౌరులుగా తయారు చేసేందుకు కృషి చేశారు. ఇలాంటి వ్యక్తి బెత్తం వదిలిపెట్టి లాటి పట్టుకున్నారు. పోలీస్ శాఖలో చేరెందుకు ఆయన చాలా కష్టపడ్డారు. అనుకున్న లక్ష్యం సాధించారు. కడప డీఎస్పీగా అప్పట్లో పనిచేశారు. ఇప్పుడు ఆ జిల్లాకే ఎస్పీగా వస్తున్నారు. కడప డీఎస్పీగా ఉన్నప్పుడు రౌడీల
పని పట్టారు. ఎర్రచందనం రవాణా ఆట కట్టించారు. ఎర్రచందనం అక్రమంగా రవాణా చేసే పెద్ద మనుషుల పని పట్టా.రు సుమారు మూడు సంవత్సరాల పాటు కడప డీఎస్పీగా పని చేశారు. అనంతపురం జిల్లా నార్పాల గ్రామానికి చెందిన అశోక్ కుమార్ చాలా బాధ్యతగల పోలీసు అధికారి. ప్రభుత్వం సోమవారం రాత్రి పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. కడప ఎస్పీగా అశోక్ కుమార్ ను నియమించారు. కడపలో ఎస్పీగా పనిచేస్తున్న హర్షవర్ధన్ రాజు గత ఏడాది నవంబర్ ఎనిమిదో తేదీ బదిలీ చేసింది. ఈ బదిలీల్లో ఎస్పీ హర్షవర్ధన్ రాజు తిరుపతి ఎస్పీగా నియమించారు. కడప ఎస్పీగా ఉన్న హర్షవర్ధన్ రాజు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇంచార్జ్ ఎస్పీగా అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు నియమించారు. కడప ఎస్పీగా వస్తున్న అశోక్ కుమార్ 2014 నవంబర్ 18వ తేదీ నుండి 2017 ఆగస్టు రెండో తేదీ వరకు కడప డీఎస్పీగా పనిచేశారు. ఒకటి రెండు రోజుల్లో కడప జిల్లా ఎస్పీగా అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం

## టీడీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం.

విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి విజయనగరం ఇంఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్,ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ నాయకులు హాజరయ్యారు.
హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరు. గత ప్రభుత్వంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారు. గత పాలనలో సమస్యలపై విరోచితంగా పోరాటం చేసాం. గత ఐదు సంవత్సరాలు నిరంకుశ పాలన జరిగింది. ప్రతీ నియోజకవర్గంలో కూడా కార్యకర్తలు అత్యధిక మెజార్టీతో గెలిపించారు. టిడిపి నాయకులకు,కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. గత ఐదు సంవత్సరాలు అన్ని వ్యవస్థలను నాశనం చేసారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సహకారంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నా,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన జరుగుతుంది. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుంది. త్వరలో విజయనగరం జిల్లా టిడిపి పార్టీ కార్యాలయం నిర్మాణం జరగబోతుంది. విజయనగరం వెనుకబడిన జిల్లా అనే పదాన్ని తీసేయండి. ఈ జిల్లాలో అనేక సహజ వనరులు ఉన్నాయి. అభివృద్ధి జరుగుతున్న జిల్లాగా మార్చుదాం. చంద్రబాబు నాయుడు చేతులు మీదగా శంకుస్థాపన జరిగితే-ఆయన చేతుల మీదగానే ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు ఎక్కువుగా చేసిన వారిని సభలో సత్కరించారుర.

## రెవెన్యూ భవన్లో పేకాట పాపారావు..?

అనంతపురం జిల్లా కలెక్టరేట్ అన్షైన్లో పేకాట ఆడిన రెవెన్యూ అధికారి కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్లో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి మలోల హాజరయ్యారు.ఒక వైపు సమావేశం జరుగుతుండగా మరోవైపు మలోల అన్షైన్లో పేకాట ఆడారు. పలు సంఘాల నేతలు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినా పట్టనట్లు వ్యవహరించారు. ఆయన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సిరిసిల్ల నేతన్నల సంక్షేమానికిప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ సిరిసిల్ల నేతన్నలకు ఇందిరా మహిళా శక్తి చీరల కోసం 4.24 కోట్ల మీటర్ల ఆర్డర్ఇప్పటికే పెండింగ్ లో ఉన్న 500 కోట్ల బకాయిలు విడుదల. మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖసిరిసిల్ల చేనేత కార్మికులకు ప్రజా పాలన ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘాలకు అందించే యూనిఫాం చీరల ఆర్డర్ ఇచ్చి పెద్ద ఎత్తున పని కల్పించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు అందించే ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా అందరికీ ఒకే రంగు గల ఒక్కొకరికి ఒక్కో చీరను అందజేసేందుకు 4.24 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్స్ అందజేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 30 వ తేది లోపు ఈ చీరలు సిద్ధం కానున్నాయని ఆకాంక్షించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల కి 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
స్కూల్ యూనిఫాం మరమగ్గాల సంఘాలకు 65.67 లక్షల మీటర్స్ ఆర్డర్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పటికే పెండింగ్ లో ఉన్న వివిధ శాఖలకు సంబంధించి 500 కోట్ల బకాయిలు విడుదల చేశామని తమ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను విస్మరించిందని బకాయిలు కూడా చెల్లించకుండా చేనేత కార్మికులను ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు.

# తప్పిన పింఛన్ కష్టాలు!

**వలస కూలీలు, వ్యాధిగ్రస్తులకు ఊరట**

**మూడు నెలల కోసారి తీసుకునేలా వ్యసులుబాటు**

**టిడిపి నేత బద్వేల్ మండల క్లస్టర్ ఇంచార్జ్ బిజీ వేముల రామచంద్రారెడ్డి**

బద్వేలు, వివిధ కారణాలతో ప్రతి నెల కొందరు లబ్ధిదారులు ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందుకోలేకపోతున్నారు ఇలాంటి వారితో పాటు పింఛన్ దారులందరికీ కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించిందని బద్వేల్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండల క్లస్టర్ ఇంచార్జ్ బిజీ వేముల రామచంద్రారెడ్డి అన్నారు. వరుసగా రెండు నెలలు తీసుకోకపోయినా మూడోనెలతో కలిపి మొత్తం తీసుకునేలా వెసులుబాటు కూటమి ప్రభుత్వం కల్పించింది కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పింఛన్ మొత్తాన్ని3 వేల నుంచి 4 వేలకు పెంచింది ఏప్రిల్ నుంచి జూన్ వరకు కలిపి జూలైలో లబ్ధిదారులకు 7 వేలు అందించింది. విభిన్న ప్రతిభావంతులకు 6 వేలు వ్యాధిగ్రస్తులకు తీవ్రత మేరకు 10 వేలు,15 వేలు అందజేస్తుంది. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా వలస కూలీల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం మూడు నెలలకు ఒకేసారి లబ్ధి పొందడానికి అవకాశం కల్పించింది 2019లో ఏర్పడిన వైకాపా ప్రభుత్వం మూడు నెలలకోసారి పింఛన్ పొందే విధానాన్ని రద్దు చేసింది. జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్ళిన వారు చికిత్స కోసం ఆసుపత్రులకు వెళ్లిన లబ్ధిదారులు ఆ నెలలో సొమ్ము వదులుకోవాల్సి వచ్చేది. దీన్ని కూటమి ప్రభుత్వం పున రుద్ధరిస్తూమార్గదర్శకాలు జారీ చేసింది తక్షణం వీటిని అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. కడప జిల్లా వ్యాప్తంగా7 నియోజకవర్గాల్లో2,58,918 మంది పింఛన్దారులకు కోట్లు రు11,041.88 లక్షలు ప్రభుత్వం ప్రతినెల అందించనుంది అన్నారు. అలాగే బద్వేల్ నియోజకవర్గం లోని అర్బన్ రూరల్ ప్రాంతాల్లో వివిధ21 రకాల పింఛన్లు37,384 మంది పింఛన్దారులకు కోట్ల రు 15,91.09 లక్షలు పొందుతున్నారన్నారు.

×మార్గదర్శకాలు ఇలా:'

ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి సూచన మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలలో పింఛన్ అందుకొని లబ్ధిదారులకు జనవరిలో రెండు నెలలు కలిపి మొత్తం చెల్లించనున్నారు. డిసెంబర్, జనవరిలో సొమ్ము తీసుకొని వారికి వరుసగా మూడు నెలల పాటు లబ్ధి పొందని వారిని శాశ్వత వలసదారులుగా గుర్తించి పింఛన్ నిలిపివేస్తారు. శాశ్వత వలసదారులు గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఎంపీడీవోలు ద్వారా పింఛన్ నిలిచిన మూడు నెలల్లోపు పునరుద్ధరించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు.వారికి బకాయిలు అందజేయకుండా ప్రభుత్వం అనుమతించిన నెల నుంచి పింఛన్ అందజేస్తారు.

×సద్వినియోగం చేసుకోవాలి:

ఉపాధి నిమిత్తం వలస వెళ్లేవారు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నెలల కొక సారీ పింఛన్ తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రారెడ్డి కోరారు.

## క్రీడల్లో ప్రాంత, కుల, మత భేదాభిప్రాయాలు ఉండవు

హైదరాబాద్ అంబర్పేట్ మెట్రో వాటర్ వర్క్స్ సివరాజ్ బోర్డు గ్రౌండ్లో నిర్వహిస్తున్న 18వ రాజీవ్ గాంధీ స్మారక ఆల్ ఇండియా అండర్ 19 టి-20 డే అండ్ నైట్ క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీలకు న టిపిసిసి ఇన్ఛీ చార్జ్ దీపాదాస్ మున్షి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాజ్యసభ మాజీ సభ్యుడు వి హనుమంతరావు హాజరయ్యారు. దీపదాస్ మున్షీ మాట్లాడుతూ క్రీడల్లో ప్రాంత, కుల, మత భేదాభిప్రాయాలు ఉండవు. తమ ప్రతిభ పాట వాళ్ళు పెంపొందించుకోండి. క్రీడలు స్నేహ, సౌభ్రా తృత్వాలు పెచ్చుతాయి. దేశంలో మొట్టమొదటిసారిగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు రేవంత్ రెడ్డి కృషి ప్రశంసనీయమని అన్నారు.

## డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించేది బిజెపి మాత్రమే

## బిజెపి ఎస్సి మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్




హైద్రాబాద్ జనవరి 21. డాక్టర్బి ఆర్ అంబేద్కర్న్.. రాజ్యాంగ ని గౌరవించేది బిజెపి మాత్రమే ననిబిజెపి ఎస్సి మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సంవిధన్ గౌరవ అభియాన్ కార్యక్రమ గోల్కొండ జిల్లా కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై భవిస్తత్ కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 21 నుండి 23 వరకు దళిత బస్తీలలో డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ ఆలోచనను బిజెపి గౌరవిస్తున్న తీరు.. అదే విధంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలి. జనవరి 24.25 తేదీలలో హాస్టల్ సందర్శించాలి. 26 న ప్రతి పోలింగ్ భూత్ లో జెండా ఎగురవేయాలి.. రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయిన్చాలి.. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పండు యాదవ్..కార్పొరేట్ డాక్టర్ సురేఖ.. ప్రధాన కార్యదర్శి సింగ్ .పార్లమెంట్ కన్వీనర్ పాల్గొన్నారు

# వాతావరణ ఉష్ణోగ్రతల అదుపునకు క్లీన్ ఎనర్జీ ఒక్కటే పరిష్కారం!

**భారత గ్రీన్ హైడ్రోజన్ రంగంలో 8లక్షల కోట్ల పెట్టుబడులు**

**2030నాటికి 18 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ లక్ష్యంగా ఏపి అడుగులు**

**ఎపిలో ప్రపంచంలోనే అతిపెద్ద రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు సిద్ధం**

**వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి లోకేష్**

దావోస్: ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న కర్బన ఉద్గారాలను తగ్గించి, వాతావరణంలో ఉష్ణోగ్రతలను అదుపు చేయడానికి క్లీన్ ఎనర్జీ ఒక్కటే ఏకైక పరిష్కార మార్గమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. దావోస్ బెల్వెడేర్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా "పర్యావరణ పరిరక్షణ ? వాతావరణ ఉద్యమ భవిష్యత్" అనే అంశంపై స్వనీతి ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్వనీతి ఇనిషియేటివ్ సిఇఓ రిత్వికా భట్టాచార్య వ్యాఖ్యాతగా వ్యవహరించగా, జోర్డాన్ క్వీన్ డాక్టర్ రానియా అల్ అబ్దుల్లా, పోర్చుగల్ మాజీ ప్రధాని జోస్ మాన్యుల్ బరాసో, యునెస్కాప్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ మార్గా గ్యుయల్ సోలెర్, సెడ్ ఫండ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వికాస్ మెహతా, ఇండోనేషియా జాతీయాభివృద్ధి మంత్రి రచ్మట్ పంబుడి, ఇండికా ఎనర్జీ ప్రెసిడెంట్ డైరక్టర్ అర్సాద్ రజీద్, రెన్యు పవర్ జింక్ సిఇఓ వైశాలి నిగమ్ సిన్హా పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 2023 ఇప్పటివరకు అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. అ ఏడాది పూర్వ పారిశ్రామిక సగటు కంటే 1.45లీఅ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రీన్ హౌస్ వాయు సాంద్రతలు 2022లో గరిష్టస్థాయికి చేరాయి, ఆ తర్వాత కూడా అది కొనసాగుతూనే ఉంది. గత 65సంవత్సరాల్లో ఎన్నడూ లేనివిధంగా సముద్రపు వేడి గరిష్టస్థాయికి చేరింది. 2022-23లో గ్లేసియర్ నష్టం రికార్డుస్థాయికి చేరింది. కేవలం స్విట్జర్లాండ్ లోనే రెండేళ్లలో హిమానీనద పరిమాణం 10% కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా పరివర్తన కోసం 2030నాటికి పునరుత్పాదక శక్తి, వాతావరణ లక్ష్యాలను చేరుకోవడానికి 4ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయి. 2050నాటికి క్లీన్ హైడ్రోజన్ డిమాండ్ 125 - 585 ఎంటిపిఎ నడుమ ఉంటుంది. అప్పటికి పవర్ మార్కెట్ లో 50 నుంచి 65శాతంతో గ్రీన్ హైడ్రోజన్ పై చేయి సాధిస్తుంది. 2024లో గ్లోబల్ గ్రీన్ హైడ్రోజన్ పరిమాణం వి6.49 బిలియన్లను అధిగమించింది. 2032నాటికి ఇది సగటున 31శాతం పెరిగే అవకాశం ఉంది.

## ప్రజా పాలన లొ ప్రతీ పేదవాడికి న్యాయం

## ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి..

ఇబ్రహీంపట్నం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన వార్డ్ సభ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ .ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తాము. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని అన్నారు.

గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పులపాలు చేసిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు తప్పకుండ అమలు చేస్తామన్నారు. రుణమాఫీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. రైతులు ఎవ్వరు కూడా ఆదర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు స్థలం ఉన్నా వారికీ మొదటి ప్రాధాన్య ఇస్తామని అన్నారు.

# భావితరాలకు ఉపయోగపడే విధంగా మంథని అభివృద్ధి శ్రీధర్ బాబు తోనే సాధ్యం

## –ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు




మంథని భావితరాలకు ఉపయోగపడే విధంగా మంథని నియోజకవర్గంలో అభివృద్ధి అనేది రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తోనే సాధ్యమవుతుందని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. మంగళవారం మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోలు శివ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో మంథని,కాళేశ్వరం బస్టాండ్ల విస్తరణ కొరకు 4 కోట్ల 90లక్షల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమా సురేష్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,ఎస్సి సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకన్న, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ లు మాట్లాడుతూ రానున్న రోజులలో జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మంథని బస్టాండ్ ని 95 లక్షల రూపాయలతో అత్యధిక హంగులతో విస్తరణ చేయడానికి,కాళేశ్వరం బస్టాండ్ ని ఆధునిక హంగులతో 3.95కోట్ల రూపాయలతో నిర్మించడానికి మంత్రి శ్రీధర్ బాబు ఆర్టీసీ బోర్డు యాజమాన్యంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందని వారికి మంథని ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.దూర ప్రాంతాల నుండి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు ఎక్కువ మొత్తంలో వెళ్తుండడంతో అలాగే రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పెద్ద మొత్తంలో అభివృద్ధి అనేది చేయడం జరుగుతుందని తెలిపారు.

మా నాయకులు సింగపూర్, దావూస్ పర్యటనలో ఉన్నా కూడా మంథని ప్రాంతానికి మంచి రవాణా సౌకర్యం కల్పించాలని ఉద్దేశం తోటి నిధులు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు.ప్రతి ఒక్క పనిని ఏ సమయంలో ఏం చేయాలో మంత్రి శ్రీధర్ బాబు కు తెలుసునని అన్నారు. కొద్ది రోజులలో రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసా వంటి మరి కొన్ని పథకాలను ప్రజలకు అందుతాయని, ప్రజలు ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోకూడదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఇది ప్రజా ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలొ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు వికె రవి, నక్క నాగేంద్ర, చోప్పకట్ల హనుమంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల కమల్,బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మంథని సురేష్ ,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు అర్థం సదానందం,ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు అర్ల నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్లు దొరగొర్ల శ్రీనివాస్,సేమంతుల ఓదెలు, ఎరుకల మధు, సీనియర్ నాయకులు పెరవెన లింగయ్య, అజీమ్ ఖాన్, లైసెట్టి రాజు,నరెడ్ల కిరణ్,కొయ్యల మొండి, దేవేందర్,రోడ్డ రాజేశ్వర్,కొంతం శ్రీను,గుండా రాజు, కావటి సమ్మయ్య,తీగల సమ్మయ్య, ఎండి అంకుష్, రామకృష్ణ, అలీమ్ ఖాన్, ఐసన్,పొనగంటి రమేష్,అక్కపక సది, నితీష్,ఎరుకల రమేష్ బాబు,సురేష్,చంద్రు విజయ్,ఎరుకల నిరంజన్,రాజు,కొరవెన కుమార్, పొరాండ్ల రంజిత్,బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ పతకాలకు గ్రామసభ



**ప్రజాబలం కొల్చారం మండలం జనవరి (21)**మెదక్ జిల్లా కొల్చారం మండలం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో మార్పులు చేపట్టాలని అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డు లు అందచేయాలనీ గుడిసెల్లో నివాసం ఉండడంతో పాటు అద్దె ఇంట్లో ఉన్నటువంటి అందరికి ఇందిరమ్మ మంజూరు చేయాలనీ మంగళవారం జరిగిన గ్రామ సభలో దృష్టికి విన్నవించారు మెదక్ జిల్లా కొల్చారం మండలం కోనాపూర్ తుక్కాపూర్ సీతారాం తండా వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామ సభలు ప్రతేక అధికారులు ఆధ్వర్యంలో కోనాపూర్ లో మండలం వ్యవసాయ అధికారి శ్వేత కుమారి అధ్యక్షాతన జరిగిన గ్రామసభలో కొల్చారం మండల బిఆర్ఎస్ యువత తుక్కలపల్లి సంతోష రావు మాజీ సర్పంచులు మోత్కు మల్లేశం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులు ఎంపికలు 2023-24 వ సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ 20 10 దినాలు చేసిన వారికి చోటు లభించడంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని భూమిలేని ప్రతి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తించేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని విన్నవించారు తుక్కాపూర్ ఎంపీడీవో కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆత్మ కమిటీ మాజీ ఈ డైరెక్టర్ మాట్లాడుతూ గతంలో బి ఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిన రేషన్ కార్డుల్లో కొత్త రేషన్ కార్డులుగా చూపిస్తున్నారని అర్హత గల వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేయాలని కోరారు సీతారంతాండాలో మహమ్మద్ గఫర్ మియా,సెక్రటరీ రాజేశ్వరి ఫీల్డ్ సురేష్ ,మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శోభ శ్రీనివాస్, శ్రీధర్, కె లక్ష్మణ్, శోభ, పి శంకర్, రెడ్యా, తదితరులు పాల్గొన్నారు....



# టిప్పర్ కు ఢీ కొని యువకుడు మృతి

**ప్రజాబలం కొల్చారం మండలం జనవరి (21)**మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్ తండా కు చెందిన గుగోలోత్ పిర్యా కుమారుడు పవన్ ఏడుపాయల పాత కమాన్ వద్ద టిప్పర్ కు ఢీ కొని స్పాట్ లో మృతి చెందాడు...

# సినిమా



## అసలు రూపం మారిపోయిన 'భైరవం'



ఒక రీమేక్ ఎంచుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో దర్శకులకు పెద్ద సవాల్ గా మారిపోయింది. ఒరిజినల్ వెర్షన్ ని సబ్ టైటిల్స్ తోనో లేదా డబ్బింగ్ ఆడియోలోనో చూసి ముందే అవగాహనకు వస్తున్న ప్రేక్షకులు పెరిగిపోతున్నారు. అలాని ప్రతిదీ వర్కౌట్ అవ్వదని కాదు. సరైన మార్పులు చేర్పులు చేసుకుంటే ఖచ్చితంగా మెప్పించే అవకాశం ఉంటుంది.భైరవం వర్క్ చూస్తుంటే అదే అనిపిస్తోంది. బెల్లకొండ సాయిశ్రీనివాస్ మూడేళ్ళ గ్యాప్ తర్వాత తెలుగులో కనిపించబోతున్న సినిమా ఇదే. నారా రోహిత్, మంచు మనోజ్ లతో స్క్రీన్ పంచుకోవడంతో దీని మీద క్రమంగా అంచనాలు రేగడం మొదలయ్యింది.గత ఏడాది కోలీవుడ్ సూపర్ హిట్స్ లో ఒకటిగా నిలిచిన గరుడన్ రీమేక్ ఇది. అయితే తాజాగా వచ్చిన భైరవం టీజర్ చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. మూలకథను తీసుకుని తెలుగు మాస్ ఆడియన్స్ కి తగ్గట్టు చేసిన కీలక మార్పులు బాగానే కనిపిస్తున్నాయి. ముగ్గురు ప్రాణ స్నేహితులు, వాళ్ళ మధ్య బంధాన్ని రామలక్ష్మణులు, ఆంజనేయుడులతో పోలుస్తూ తీర్చిదిద్దిన క్యారెక్టరైజేషన్ విభిన్నంగా ఉంది.ఈ మధ్య బ్లాక్ బస్టర్స్ లో బాగా పండుతున్న జాతర ఎపిసోడ్ ఒకటి భైరవంలోనూ ఉంది. సాయిశ్రీనివాస్ నటనలోని కొత్త కోణంలో ఇందులోనే చూడొచ్చు. చిన్న శాంపిల్ ని టీజర్ లో చూపించారు. నాంది, ఉగ్రం ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన భైరవంని ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. డేట్ ఇంకా నిర్ణయించలేదు. దర్శకుడు శంకర్ కూతురు అదితి శంకర్ టాలీవుడ్ కు ఈ సినిమాతోనే పరిచయమవుతోంది. సీనియర్ నటి జయసుధ చాలా కాలం తర్వాత నాయనమ్మగా ముఖ్యమైన పాత్ర పోషించారు.

## డాకు స్టామినాకు వైడి రాజు బ్రేకు!




వరసగా నాలుగో బ్లాక్ బస్టర్ బాలకృష్ణ ఖాతాలో వేసిన డాకు మహారాజ్ ఎనిమిది రోజులకు 156 కోట్లకు పైగా గ్రాస్ సాధించి బాక్సాఫీస్ వద్ద స్టడీగా ఉంది. దీని పొటెన్షియాలిటీకి రెండు వందల కోట్లు దాటేసి ఉండాలనేది అభిమానుల వెర్షన్. నిర్మాత నాగవంశీ కూడా ఇదే తరహా ధీమా ముందు నుంచి వ్యక్తం చేస్తూ వచ్చారు.అయితే వైడి రాజు అలియాస్ వెంకటేష్ రూపంలో స్పీడ్ బ్రేకర్ వస్తుందని ఎవరూ ఊహించలేదు. పండగ పోటీలో చివరిగా వచ్చిన సంక్రాంతి వస్తున్నాం అనూహ్యంగా కేవలం ఫస్ట్ వీక్ కే 100 కోట్ల షేర్ దాటడం మాటలకందని అనూహ్యం. ఇంత విజయం టీమ్ ఊహించి ఉండదనేది వాస్తవం.ఫ్యామిలీ ఆడియన్స్ అంటే ఏమో అనుకోవచ్చు కానీ సంక్రాంతికి వస్తున్నాంకి మాస్ అండ పుష్కలంగా దక్కిందని కలెక్షన్లు స్పష్టం చేస్తున్నాయి. మండపేట లాంటి చిన్న సెంటర్లలోనూ ఆర్ఆర్ఆర్ రికార్డులు బద్దలు కొట్టడమంటే మాటలు కాదు. అక్కడే కాదు చాలా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.కొన్ని చోట్ల పుష్ప 2ని దాటేసే దిశగా పరుగులు పెడుతోంది. టాక్ ఒక వైరల్ ఫీవర్ లా పాకిపోవడంతో జనాలు మొదటి ప్రాధాన్యతగా సంక్రాంతికి వస్తున్నాంనే ఎంచుకుంటున్నారు. తర్వాత ఆప్షన్ గా డాకు మహారాజ్ నిలుస్తోంది. గేమ్ ఛేంజర్ పూర్తిగా రేసు నుంచి తప్పుకోవడం సానుకూలంగా పని చేసింది. ఒకవేళ డాకు మహారాజ్ కనక సోలోగా వచ్చి ఉంటే ఇంకా మెరుగ్గా నడిచేదన్న కామెంట్స్ ని కొట్టిపారేయలేం. పైగా ఓవర్సీస్ కి కంటెంట్ డెలివరీలో జరిగిన జాప్యం ఓపెనింగ్స్ మీద ప్రభావం చూపించింది. ఏపీలో ఇచ్చిన టికెట్ రేట్ల పెంపు కలెక్షన్ నెంబర్లు త్వరగా చేరుకునేందుకు దోహదపడింది.

## 'బుల్లిరాజు' విమర్శలకు అనిల్ సమాధానం




సంక్రాంతి కానుకగా విడుదలై బ్లాక్ బస్టర్ సక్సెస్‌తో దూసుకుపోతున్న చిత్రం.. సంక్రాంతికి వస్తున్నాం. ఈ చిత్రంలో చాలా విశేషాలు ఉన్నాయి కానీ.. అన్నింట్లోకి హైలైట్ అయింది మాత్రం బుల్లిరాజు అనే చిన్న పిల్లాడి పాత్ర చేసిన కామెడీనే. ఓటీటీలు చూసి పాడైపోయి, కనిపించిన ప్రతి వాడి మీద బూతుల వర్షం కురిపించే పిల్లాడిగా రేవంత్ అనే అబ్బాయి అదరగొట్టేశాడు. గోదావరి స్లాంగ్‌లో అతను చెప్పిన డైలాగులకు థియేటర్లు హోరెత్తిపోతున్నాయి.ఐతే ఈ పాత్ర విషయంలో విమర్శలు కూడా తప్పట్లేదు. అంత చిన్న పిల్లాడితో అలాంటి బూతులు చెప్పించి సొసైటీకి ఏం సందేశం ఇస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కామెడీ విషయంలో ఫిలిం మేకర్స్ మరీ ఇన్‌సెన్సిటివ్‌గా తయారవుతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ పాత్రను చూసి పిల్లలు ఇన్‌స్పైర్ అయితే ప్రమాదం కదా అని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు అనిల్ రావిపూడి స్పందించాడు. "బుల్లిరాజు పాత్రకు థియేటర్లలో ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆ కామెడీని అందరూ సరదాగా తీసుకుంటున్నారు. ఎంజాయ్ చేస్తున్నారు. కానీ ఈ పాత్ర విషయంలో విమర్శలు నా దృష్టికి వచ్చాయి. మా ఫ్రెండ్స్ కూడా కొందరు పిల్లాడితో అలా బూతులు చెప్పించడం ఏంటి అని అడిగారు. కానీ మేం ఆ పాత్రతో చిన్న సందేశం ఇచ్చాం. పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలు ఓటీటీలో కంటెంట్ చూస్తే.. వాటికి ఎక్కువ అలవాటు పడితే ఎంత ప్రమాదం అన్నది చూపించాం. ఇంగ్లిష్, హిందీ వెబ్ సిరీస్‌లకు తెలుగు అనువాదాలు చూశారంటే దారుణమైన బూతులు ఉంటాయి. వాటిని విని తట్టుకోలేం. అలాంటివి పిల్లలు చూడకూడదని చెప్పడమే మా ఉద్దేశం.

## కెరీర్లను డిసైడ్ చేయబోతున్న సినిమా




మెగా ఫ్యామిలీ హీరో వరుణ్ తేజ్ కెరీర్ కొన్నేళ్ల నుంచి తిరోగమనంలో పయనిస్తోంది. అతడికి సోలో హీరోగా ఓ మోస్తరు విజయం దక్కి కూడా చాలా ఏళ్లయిపోయింది. గని, గాండీవధారి అర్జున్, ఆపరేషన్ వాలెంటైన్, మట్కా.. ఇలా సోలో హీరోగా తన చివరి సినిమాలు ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లవడంతో తన మార్కెట్ దారుణంగా దెబ్బతింది. ముఖ్యంగా 'మట్కా' కొట్టిన దెబ్బ అలాంటిలాంటిది కాదు. ఈ చిత్రానికి మినిమం ఓపెనింగ్స్ లేవు. పెట్టుబడిలో ఐదో వంతు కూడా థియేటర్ల నుంచి వెనక్కి తేలేకపోయిందీ చిత్రం. దీంతో వరుణ్ కొత్త ప్రాజెక్టుల మీద ప్రభావం పడే పరిస్థితి వచ్చింది. అతను హీరోగా యువి క్రియేషన్స్ సంస్థలో మేర్లపాక గాంధీ తెరకెక్కించాల్సిన చిత్రం ఆగిపోయినట్లు వార్తలు వచ్చాయి. కానీ యువి సంస్థ ఈ చిత్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికే నిర్ణయించింది. తాజాగా ఈ చిత్రాన్ని అనౌన్స్ చేశారు కూడా. వరుసగా సీరియస్ సినిమాలు చేసి ఎదురు దెబ్బలు తిన్న వరుణ్ తేజ్.. ఈసారి కామెడీ ట్రై చేయబోతున్నాడు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాల్లో చక్కటి వినోదం అందించిన మేర్లపాక గాంధీ.. అదే స్టయిల్లో వరుణ్ సినిమాను రూపొందించబోతున్నాడు. వీరి కలయికలో రానున్న సినిమా రాయలసీమ నేపథ్యంలో సాగనుంది. దీనికి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో క్రిష్ కుటుంబ సంస్థ అయిన 'ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్' కూడా భాగస్వామి కానుంది. తొలి రెండు చిత్రాలతో ప్రామిసింగ్‌గా కనిపించిన మేర్లపాక గాంధీ కూడా తర్వాత కృష్ణార్జున యుద్ధం, లైక్ సబ్‌స్క్రైబ్ షేర్ చిత్రాలతో తీవ్రంగా నిరాశపరిచాడు.

## ఓవర్ టు నాగచైతన్య...



కొత్త ఏడాది మొదలయ్యాక సినీ ప్రియులందరి దృష్టి సంక్రాంతి చిత్రాల మీదే ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ సీజన్లో భారీ చిత్రాలు రిలీజవుతాయి. వారం పది రోజుల పాటు చర్చలన్నీ సంక్రాంతి చిత్రాల చుట్టూనే తిరుగుతాయి. ఈసారి గేమ్ చేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం లాంటి క్రేజీ చిత్రాలు సంక్రాంతి రేసులో నిలిచాయి. వీటిలో ముందుగా రిలీజైన భారీ చిత్రం 'గేమ్ చేంజర్' ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. రెండో డాకు మహారాజ్ మంచి రిజల్ట్ సాధించింది. సంక్రాంతికి వస్తున్నాం ఎవ్వరూ ఊహించని స్థాయిలో బ్లాక్ బస్టర్ అయింది. ఐతే సంక్రాంతి సినిమాల కథ ఈ వీకెండ్‌తో ఒక కొలిక్కి వచ్చేసింది. వాటి ఫైనల్ రిజల్ట్ మీద కూడా ఒక అంచనా వచ్చేసినట్లే. సోమవారం నుంచి 'గేమ్ చేంజర్' కథ ముగిసినట్లే భావిస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం', 'డాకు మహారాజ్' సినిమాలు ఇంకో వారం పాటు ఓ మోస్తరు వసూళ్లతో సాగే అవకాశం ఉంది. మొత్తానికి సంక్రాంతి సినిమాల చర్చలకు త్వరలో ముగియబోతున్నాయి. ఆ తర్వాత ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే సినిమా ఏది అంటే.. 'తండేల్' పేరే చెప్పాలి. వచ్చే రెండు వారాలు తెలుగులో చెప్పుకోదగ్గ రిలీజ్‌లు ఏమీ లేవు. ఈ శుక్రవారం సుకుమార్ తనయురాలు సుకృతి ప్రధాన పాత్ర పోషించిన 'గాంధీ తాత చెట్టు' సహా ఇంకొన్ని చిన్ని చిత్రాలేవో రిలీజవుతున్నాయి. ఆ తర్వాతి వారానికి చెప్పుకోదగ్గ సినిమాలేవీ షెడ్యూల్ కాలేదు. ఈ రెండు వారాల్లో వచ్చే చిత్రాలకు ప్రేక్షకులు థియేటర్లకు రావడం కష్టమే.సంక్రాంతికి బాగా ఖర్చు పెట్టేసిన ప్రేక్షకులు కొంచెం గ్యాప్ తీసుకుని ఫిబ్రవరి 7న రానున్న 'తండేల్' మీద ఫోకస్ చేయబోతున్నారు. ఆ సినిమా మీద భారీ అంచనాలే ఉన్నాయి. ముందు నుంచి ప్రామిసింగ్‌గా కనిపిస్తున్న చిత్రమిది. నాగచైతన్య-సాయిపల్లవి జోడీ మీద కూడా చాలా ఆశలతో ఉన్నారు.

## దిల్ రాజు టార్గెట్‌గా ఐటీ దాడులు



టాలీవుడ్ బడా నిర్మాత దిల్ రాజు టార్గెట్ గా మంగళవారం తెల్లవారుజామున ఆదాయపన్ను శాఖ సోదాలు మొదలయ్యాయి. బడా నిర్మాతగానే కాకుండా తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైట్కర్మన్ గా వ్యవహరిస్తున్న రాజుపై ఆదాయపన్ను శాఖ దాడులు చేస్తోందన్న వార్తలు అటు సినీ ఇండస్ట్రీతో పాటు ఇటు పొలిటికల్ సర్కిళ్లలోనూ హాట్ టాపిక్ గా మారింది. దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయనకు చెందిన కార్యాలయాలపైనా ఐటీ అధికారులు ఏకకాలంలో సోదాలు మొదలుపెట్టారు. దిల్ రాజుతో పాటుగా శిరీష్, దిల్ రాజు కుమార్తె హన్షిత రెడ్డిల ఇళ్లు, కార్యాలయాలపైనా ఐటీ అధికారులు మూకుమ్మడిగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పలు బృందాలుగా విడిపోయిన ఐటీ అధికారులు హైట్కదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మిక దాడులను చేపట్టారు. ఫలితంగా నగరంలోని బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్, గచ్చిబౌలి, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో కలకలం రేగింది. మొత్తంగా నగరంలోని 8 ప్రాంతాల్లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఈ సంక్రాంతికి తెలుగులో ప్రధానంగా మూడు సినిమాలు రిలీజ్ కాగా.. వాటిలో రెండు దిల్ రాజు నిర్మించినవే ఉన్నాయి. గ్లోబల్ స్టార్ రాంచరణ్ తేజ్ ప్రదాన పాత్రలో తెరకెక్కిన గేమ్ ఛేంజర్ వాటిలో భారీ బడ్జెట్ చిత్రం కాగా%ొ% విక్టరీ వెంకటేశ్ ప్రదాన పాత్రలో తెరకెక్కిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ రెండు సినిమాలను దిల్ రాజే నిర్మించారు. ఈ రెండు సినిమాలు హిట్ టాక్ తెచ్చుకోగా.. దిల్ రాజుకు భారీ ఎత్తున లాభాలు వచ్చినట్లుగా సమాచారం.



# క్రీడలు



## స్టార్ క్రికెటర్లతో రంజీట్రోఫీ కళ కళ



రంజీట్రోఫీ సీజన్-2025 స్టార్ క్రికెటర్లతో కళ కళలాడనుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు జైస్వాల్, జడేజా, గిల్, రిషబ్ పంత్ సహా పలువురు స్టార్ ఆటగాళ్లు ఈ సీజన్ రంజీట్రోఫీ బరిలో దిగనున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో అందుబాటులో ఉండే ఆటగాళ్లు తప్పకుండా దేశవాళీ లీగ్‌ల్లో ఆడాలని ఇటీవల బిసిసిఐ ఆదేశించింది. అలాగే బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో, స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో బిసిసిఐ ఆటగాళ్ల ప్రదర్శనపై నిశితంగా పరీక్షించాలని చూస్తోంది. ఈ క్రమంలో రాబోయే రంజీట్రోఫీలో అందుబాటులో ఉన్న ఆటగాళ్లంతా బరిలోకి దిగాలని ఆదేశించింది. దీంతో 10ఏళ్ల తర్వాత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రంజీ ట్రోఫీ బరిలో దిగనున్నాడు. ఈ ఏడాది జరిగే రంజీట్రోఫీలో ముంబయి తరఫున టీమిండియా ఆటగాళ్లు రోహిత్, జైస్వాల్ ఆడనున్నారు. అజింక్యా రహానె సారథ్యంలో రోహిత్ రంజీ మ్యాచ్ ఆడనున్నాడు. జనవరి 23-26 మధ్య ముంబయి, జమ్మూ-కాశ్మీర్ మధ్య రంజీట్రోఫీ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ముంబయి 17మందితో కూడిన జట్టును ప్రకటించింది. రోహిత్‌తోపాటు స్టార్ ఆటగాళ్లు జైస్వాల్, శ్రేయస్, శివమ్ దూబె, శార్దూల్ ముంబయి జట్టుకు ఎంపికయ్యారు. అలాగే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(సౌరాష్ట్ర), శుభ్‌మన్ గిల్(పంజాబ్), రిషభ్ పంత్(ఢిల్లీ) కూడా రంజీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమవుతున్నారు. వీరితోపాటు కెఎల్ రాహుల్(కర్ణాటక), విరాట్ కోహ్లి(ఢిల్లీ) రంజీట్రోఫీ తొలిరౌండ్ పోటీలకు దూరమైనా.. ఆ తర్వాత మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే ఛాన్స్ ఉంది. రెండో లీగ్ రంజీట్రోఫీలో భాగంగా 23నుంచి జరిగే పోటీల్లో ఆంధ్ర జట్టు పాండిచేరితో, హైదరాబాద్ జట్టు హిమాచల్ ప్రదేశ్‌తో తలపడనున్నాయి. జట్టు: రహానె(కెప్టెన్), రోహిత్, జైస్వాల్, ఆయుష్ మాత్రే, శ్రేయస్, సిద్ధేష్ లాడ్, దూబె, హార్దిక్ టామోర్, ఆకాష్ ఆనంద్(వికెట్ కీపర్), తనుష్ కోటియన్, శామ్స్ ములానీ, హిమాన్షు సింగ్, శార్దూల్, మోహిత్ అవస్థి, సిల్వెస్టర్ డిసౌజా, రాయిస్టన్ డయాస్, కర్ష్ కొఠారి.

## క్రికెటర్ ఇంట తీవ్ర విషాదం..



పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ అబ్బాస్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. అతని సోదరి ఆసుపత్రిలో మరణించింది. ఈ సమాచారాన్ని ఆయనే స్వయంగా సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. అతను ఇటీవల దక్షిణాఫ్రికా పర్యటన నుండి పాకిస్తాన్ టెస్ట్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. ఈ టెస్టు సిరీస్‌లో అతను అద్భుతమైన ప్రదర్శన కూడా చేశాడు. మహ్మద్ అబ్బాస్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఇలా రాశాడు. నా సోదరి ఇప్పుడు ఈ ప్రపంచంలో లేదు. అల్లా ఆమెకు స్వర్గంలో పెద్ద స్థానం ప్రసాదిస్తాడు. దయచేసి మీ ప్రార్థనలలో ఆమెను స్మరించుకోండి అని రాసుకొచ్చాడు. మహ్మద్ అబ్బాస్ పాకిస్తాన్ ప్రముఖ ఫాస్ట్ బౌలర్ తక్కువ సమయంలో తన బౌలింగ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్ద స్థానాన్ని సాధించాడు. అతనికి ఫాస్ట్ బౌలింగ్‌తో పాటు స్వింగ్ రూపంలో పెద్ద ఆయుధాన్ని కలిగి ఉన్నాడు. ఇది అతనిని ప్రత్యేకంగా చేస్తుంది. అతను తన బౌలింగ్ ద్వారా చాలా ముఖ్యమైన మ్యాచ్‌లలో తన జట్టును విజయపథంలో నడిపించాడు. ఈ పాక్ బౌలర్ ఇప్పటివరకు 27 టెస్టులు ఆడి 23.18 సగటుతో 100 వికెట్లు పడగొట్టాడు. ఈ సమయంలో అతను 2.50 ఎకానమీ వద్ద పరుగులు ఇచ్చాడు. ఇక్కడ అతని అత్యుత్తమ ప్రదర్శన 54 పరుగులకు ఆరు వికెట్లు తీయడం. ఈ సమయంలోనే అతను ఐదుసార్లు ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసి రికార్డు సృష్టించాడు. అబ్బాస్ వన్డేల గురించి మాట్లాడుకుంటే.. ఈ ఫార్మాట్‌లో అతనికి చాలా మ్యాచ్‌లు ఆడే అవకాశం రాలేదు. అతను ఇప్పటివరకు మూడు వన్డేలు మాత్రమే ఆడాడు. అందులో ఒక వికెట్ తీసుకున్నాడు. మహ్మద్ అబ్బాస్ వన్డేల్లో తక్కువ మ్యాచ్‌లు ఆడటంతో తన ప్రదర్శన నిరూపించుకునే అవకాశం రాలేదు. కానీ అతని బౌలింగ్‌లో వేగం, నియంత్రణ ఉంది. ఇది ఏ ప్రత్యర్థి జట్టుకైనా ప్రమాదకరంగానే ఉంటుంది. ఈ బౌలర్‌కు క్రికెట్‌లోని పొట్టి ఫార్మాట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు.

## టీ20 కొత్త వైస్ కెప్టెన్ హాట్ కామెంట్స్



భారత క్రికెట్ జట్టు కీలకమైన పరివర్తన దశను ఎదుర్కొంటున్న సమయంలో టీ20 వైస్ కెప్టెన్ అక్సర్ పటేల్ తన పాత్రపై స్పష్టత వ్యక్తం చేశాడు. జట్టులో తన స్థానం గురించి ఆందోళన లేకుండా, అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడమే తన లక్ష్యమని అన్నాడు. సెలెక్షన్ పూర్తిగా కెప్టెన్లు మరియు సెలెక్టర్ల నిర్ణయమని అభిప్రాయపడ్డాడు. ప్రతీసారి అవకాశం వచ్చినప్పుడు, తన ప్రతిభను నిరూపించడంపైనే దృష్టి పెట్టుతానని తెలిపాడు. భారత క్రికెట్ ప్రస్తుతం ఒక పెద్ద పరివర్తన దశలో ఉంది, కానీ ఆ పరిస్థితుల్లో తన స్థానంపై ఎలాంటి ఆందోళన లేకుండా తన పాత్రకు న్యాయం చేయడంపైనే దృష్టి పెట్టాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు అక్షర్ పటేల్. 11 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో మూడు ఫార్మాట్లలో 184 వికెట్లు తీసిన అక్షర్, జట్టులో తన స్థానం గురించి నిర్భయంగా మాట్లాడారు. అక్షర్ పటేల్ తన దృష్టిని ప్రతిసారి తన పాత్రకు సమర్థంగా న్యాయం చేయడంపైనే ఉంచుతానని స్పష్టం చేశారు. "ఎవరికీ ఏదైనా నిరూపించాల్సిన అవసరం నాకు లేదు. నాకు అప్పగించిన పనిని నైపుణ్యంతో చేయడమే నా ధ్యేయం. జట్టులో నా స్థానం ప్రదర్శనతోనే వస్తుంది, ఒత్తిడితో కాదు," అని ఆయన అన్నారు. భారత క్రికెట్‌లో రవీంద్ర జడేజా తరహా ఆటగాళ్ల స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉన్నా, అక్షర్ తన ప్రదర్శనపై మాత్రమే దృష్టి పెడతానని అన్నారు. "నేను టెస్టులు, వన్డేలు, టీ20లు అన్ని ఫార్మాట్లలో ఆడగలనన్న నమ్మకంతో ఉన్నాను. ప్రదర్శన ద్వారా న్యాయం చేయడమే నా పద్ధతి," అని ఆయన పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ముందు జరిపిన చర్చల్లో, "సెలక్షన్ సంబంధిత అంశాలు సెలెక్టర్ల నిర్ణయం. నేను ఎప్పుడూ జట్టులో భాగమయ్యేందుకు తగిన ప్రయత్నం చేస్తాను. కానీ ఆందోళన చెందే స్థానం లేదు," అని

## నైజీరియా సంచలనం



ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో పసికూన నైజీరియా జట్టు సంచలనం సృష్టించింది. సోమవారం జరిగిన గ్రూప్-సి లీగ్ మ్యాచ్‌లో నైజీరియా జట్టు రెండు పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై అద్భుత విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నైజీరియా జట్టు 13ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 65పరుగులే చేసింది. అనంతరం న్యూజిలాండ్‌ను నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 63పరుగులకే పరిమితం చేసింది. 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్ల నష్టానికి 57పరుగులు చేసి గెలుపుకు చేరువైన కివీస్‌ను నైజీరియా బౌలర్ చివరి ఓవర్లో కట్టడి చేసింది. నైజీరియా బ్యాటర్లలో ఉదేహ్(19), కెప్టెన్ లక్కీ(18) రెండంకెల స్కోర్ చేయగా.. న్యూజిలాండ్ జట్టులో అనికా టోడ్(19) బ్యాటింగ్‌లో రాణించింది. గ్రూప్-డిలో ఆస్ట్రేలియా మహిళల జట్టు 2వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై, గ్రూప్-బిలో ఇంగ్లండ్ జట్టు 6వికెట్ల తేడాతో పాకిస్తాన్ మహిళలపై విజయం సాధించాయి. ఇక దక్షిణాఫ్రికా మహిళలజట్టు ఏకంగా 10వికెట్ల తేడాతో సమోవా మహిళలపై విజయం సాధించాయి. సమోవా జట్టు 9.1ఓవర్లలో 16పరుగులకే ఆలౌట్ కాగా.. దక్షిణాఫ్రికా జట్టు 1.4ఓవర్లలోనే లక్ష్యాన్ని చేదించింది.

## క్వార్టర్ ఫైనల్లో ఇగా, సిన్నర్




ప్రతిష్ఠాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ), 8వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్), 8వ సీడ్ ఎమ్మా నవ్వారో (అమెరికా) నాలుగో రౌండ్ జయకేతనం ఎగుర వేశారు. 19వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా), 28వ సీడ్ ఎలినా స్విటోలినా (ఉక్రెయిన్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ పోరులో జయభేరి మోగించారు. ఇవా లీస్ (జర్మనీ)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో అగ్రశ్రేణి క్రీడాకారిణి స్వియాటెక్ అలవోక విజయం సాధించింది. ఆరంభం నుంచే ఇగా చెలరేగి ఆడింది. ఒక్క గేమ్ కూడా కోల్పోకుండానే తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. తర్వాతి సెట్‌లో కూడా దూకుడును ప్రదర్శించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ అలవోక విజయంతో ముందంజ వేసింది. మరో పోటీలో నవ్వారో 64, 57, 75తో రష్యాకు చెందిన కసట్కినాను ఓడించింది. ఆరంభం నుంచే పోరు ఆసక్తికరంగా సాగింది. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌లో నవ్వారో విజయం సాధించింది. రెండో సెట్‌లో కూడా హోరాహోరీ తప్పలేదు. టైబ్రేకర్ వరకు వెళ్లిన సెట్‌లో కసట్కినా జయభేరి మోగించింది. ఇక ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో కూడా ఉత్కంఠ తప్పలేదు. ఈ సెట్ కూడా టైబ్రేకర్‌కు వెళ్లింది. ఇందులో పైచేయి సాధించిన నవ్వారో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. కీస్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లో చెమటోడ్చక తప్పలేదు. మూడు సెట్ల పోరాటంలో 63, 16, 63తో రికబినా (కజకిస్థాన్)పై విజయం సాధించింది. మరో పోరులో స్విటోలినా 64, 61తో రష్యా క్రీడాకారిణి వెరోనికా కుదెర్‌మెటోవాను ఓడించింది. ఆరంభం నుంచే స్విటోలినా నిలకడగా ఆడింది. తొలి సెట్‌లో కాస్త ప్రతిఘటనను ఎదుర్కొన్న తర్వాతి సెట్‌లో అలవోక విజయంతో ముందంజ వేసింది. పురుషుల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ జన్నిక్ సిన్నర్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో జన్నిక్ 63, 36, 63, 62తో హోల్గర్ రూనే (డెన్మార్క్)ను ఓడించాడు. తొలి సెట్‌లో జన్నిక్ అలవోక విజయాన్ని అందుకున్నాడు. అయితే రెండో సెట్‌లో రూనే ఆధిపత్యం చెలాయించాడు. సిన్నర్‌ను కంగుతినిపిస్తూ సెట్‌ను దక్కించుకున్నాడు. కానీ తర్వాతి రెండు సెట్లలో సిన్నర్ దూకుడును ప్రదర్శించాడు. రూనేకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ సునాయాస విజయంతో ముందంజ వేశాడు. మరో పోటీలో మినార్ 60, 76, 63తో అలెక్స్ మిచెల్‌సన్ (అమెరికా)ను ఓడించాడు. ఇతర పోటీల్లో సొనేగో (ఇటలీ), షెల్టన్ (అమెరికా) జయకేతనం ఎగుర వేశారు.

## ఆ ఎంపితో రింకు సింగ్ పెళ్లి



టీమిండియా టి20 బ్యాట్స్‌మెన్ రింకు సింగ్ ఇంటి వాడు కాబోతున్నాడు. సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఎంపి ప్రియ సరోజ్‌ను రింకు పెళ్లి చేసుకోబోతున్నారని ఆమె తండ్రి, ఎంఎల్ఎ తుఫాని సరోజ్ తెలిపారు. రింకు, ప్రియకు నిశ్చితార్థం జరిగినట్టు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను తొలుత ఖండించిన ఆయన చర్చలు జరుగుతున్నాయని వివరణ ఇచ్చారు. రెండు కుటుంబాలు పెళ్లికి అంగికరించాయని చెప్పారు. గత సంవత్సరం నుంచి ఇద్దరు మధ్య పరిచయం ఉండడంతో ప్రేమగా మారింది. పార్లమెంటు సమావేశాల తరువాత లక్నోలో నిశ్చితార్థం జరుపుతామని ప్రియ తండ్రి తెలిపారు. సమాజ్ వాదీ పార్టీ తరుపున మచిలీషహర్ నుంచి ఎంపిగా గెలిచారు. ఆమె గతంలో సుప్రీంకోర్టు న్యాయవాదిగా సేవలందించారు. ఆమె తండ్రి తుపానీ మూడు సార్లు ఎంపిగా పని చేశారు. రింకు సింగ్ ఇంగ్లాండ్‌తో జరిగే టి20 సిరీస్‌కు ఎంపికయ్యారు.

# మణికొండ బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యదర్శిగా గుట్టమీది నరేందర్



**రాజేంద్రనగర్ నియోజక వర్గం ప్రజా బలం ప్రతినిధి 21 జనవరి 2025** మణికొండ భారత రాష్ట్ర సమితి యువ నాయకుడు గుట్టమీది రాఘవేందర్ అనివార్య కారణాల వలన స్వచ్ఛందంగా తన యొక్క ముఖ్య కార్యదర్శి పదవి నుండి వైతొలుగుతూ, అట్టి పదవిని గుట్టమీది నరేందర్ కు కట్టబెట్టమని సూచించిన దరిమిలా అట్టి విషయమై పెద్దలతో సంప్రదింపులు జరిపిన పిదప పుప్పాలగూడకు సముచిత న్యాయం జరుగాలనే సదుద్దేశంతో మణికొండ బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఏకీభవించి భారీ సంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలతో కలసి మూకుమ్మడిగా మాజి మంత్రి ప్రస్తుత మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి మరియు రాష్ట్ర బీ.ఆర్.ఎస్ పార్టీ యువ నాయకుడు కార్తీక్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలసి అందరి సమక్షంలో సదరు ముఖ్య కార్యదర్శి నియామక పత్రం నరేందర్ కు అందజేయడం జరిగినది.

# జిల్లాలో మొదలైన ప్రజా పాలన గ్రామ,వార్డ్ సభలు



**రాజన్న సిరిసిల్ల , జనవరి 21 (ప్రజాబలం)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా పథకాలు,రేషన్ కార్డుల జారీ కోసం అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా పథకాలు,రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో గ్రామ,వార్డ్ సభలకు ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీకారం చుట్టింది.ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా గ్రామాలు,సిరిసిల్ల,వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డ్ ల్లో మంగళవారం పథకాల కోసం సభలు నిర్వహించారు.తంగళ్ళపల్లి మండలం గండిలచ్చపేటలో నిర్వహించిన గ్రామ సభకు హాజరై పరిశీలించారు.అర్హుల గుర్తింపు కోసం చేపట్టిన సభలో కూర్చుని మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా పథకాలు,రేషన్ కార్డుల జారీ కోసం జిల్లాలోని ఆయా గ్రామాలు,సిరిసిల్ల,వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డ్ ల్లో అర్హుల గుర్తింపు సభలు నిర్వహిస్తున్నామని వివరించారు.అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతాయని వెల్లడించారు.రేషన్ కార్డుల జారీ,ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు అనేవి నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకొని వారు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదుకు అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.ఆయా పథకాలు అర్హులైన వారికి అందుతాయని,ఎంపిక పారదర్శకంగా చేపడుతామని ఆయన స్పష్టం చేశారు.ఉదయం 9 గంటలకు మొదలు..జిల్లాలోని రుద్రంగి,బోయినపల్లి,చందుర్తి, కోనరావుపేట,వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్,ఇల్లంతకుంట, గంభీరావుపేట,ముస్తాబాద్, తంగళ్ళపల్లి,వీర్నపల్లి,ఎల్లారెడ్డిపేట తదితర మండలాల్లో 75 గ్రామాలు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 4, 5, 6,8,9,16,17,18,19,28 వార్డ్ ల్లో,వేములవాడ మున్సిపల్ పరిధిలోని 1,2,8,12,18,21,22,25 వార్డ్ ల్లో మొదటిరోజు గ్రామ,వార్డ్ సభలు నిర్వహించారు.ఉదయం 9.00 గంటల నుంచి 12.00 గంట వరకు అలాగే మధ్యాహ్నం 01.00 గంటల నుంచి 04.00 గంటల దాకా సభలు చేపట్టారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం




**ప్రజా బలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 21:**రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలలో, వార్డు సభలలో ప్రదర్శనలో ఉంచిన జాబితాలను ఒకసారి చూసుకొని ఏవైన అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకురావాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం సూచించారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటి పరిధిలోని ఉప్పర్ పల్లి 2వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా కలెక్టరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే కాకుండా, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కంగారు పడకుండా ఇప్పుడు నిర్వహిస్తున్న గ్రామసభలలో, వార్డు సభలలో కూడా దరఖాసు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని కలెక్టరు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టరు స్పష్టం చేసారు. అనంతరం శామీర్ పేట మండలంలోని బొమ్మరాశిపేటలో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టరు పాల్గొన్నారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభ, వార్డు సభలలో అధికారుల దృష్టికి తీసుకురావలసిందిగా సూచించారు.

రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టరు తెలిపారు.ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కలెక్టరు సూచించారు.

ఈ కార్యక్రమంలో శామీర్ పేట తహసీల్దారు యాదగిరి, తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్, ఎంపిడిఓ మమతా బాయి, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా గ్రామ సభలు

## సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా అదనపు కలెక్టరు విజయేంద్రరెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 21:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాల అమలు ప్రక్రియలో భాగంగా మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండలంలో రాంపల్లి దాయర గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేంద్రరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కంగారు పడవద్దని, ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అంతే కాకుండా గ్రామ, వార్డు సభలలో నోటీసు బోర్డులలో ఉంచిన జాబితాలను ఒకసారి చూసుకొని ఏవైన అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కీసర తహసీల్దార్ అశోక్ కమార్, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ రాజ్ కుమార్, ఎంపిఓ నందకిశోర్, పంచాయతీ సెక్రటరీ తిరుపతిరెడ్డి, విఆర్ఓ విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కోల్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన కళాకారులు

## ఆర్కెస్ట్రా విభాగంలో బంగారు పతకం కైవసం

## అభినందించిన మందమర్రి ఏరియా జిఎం జి. దేవేందర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 21:** కలకత్తాలోని అస్సాం సోల్ లో ఈనెల 13 నుండి 15 వరకు జరిగిన కోల్ ఇండియా సాంస్కృతిక పోటీల్లో మందమర్రి ఏరియా సింగరేణి కళాకారులు పాల్గొని మొదటిసారి ఆర్కెస్ట్రా విభాగంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోల్ ఇండియా కళాకారులను జి.ఎం జి.దేవేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డివైపిఎం ఆసిఫ్, ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఆర్కెస్ట్రా టీం కెప్టెన్ డేవిడ్ సన్, హేమంత్, ప్రభాకర్, సుదర్శన్, రాజేశ్వరరావు, అనిల్, సురేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి జనవరి 21 (ప్రజాబలం)** ఇల్లందు నియోజకవర్గం దేశ చరిత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్రు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం ఏర్పడి ఏడాది తిరగకముందే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని, రాబోయే రోజులలో ఇంకా పేదలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించమన్నదని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు కామేపల్లి మండలం పండితాపురం రిక్కి తండా బండిపాడు గ్రామాల్లో ఎంపీడీవో రవీందర్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి పేదలకు రేషన్ కార్డులు జాబితాను ప్రకటించారు. ఇంకా జాబితాలో లేని రేషన్ కార్డు లబ్ధిదారులు మరియు దరఖాస్తు చేయనివారు కూడా తిరిగి గ్రామ సభలలో, ఎం డి వో ఆఫీసులో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ గతంలో కీర్తిశేషులు రా%శీ% రెడ్డి వెంకట్ రెడ్డి హయాంలో కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ఈ గ్రామంలో పేద ధనిక కులాలకతీతంగా దాదాపు 500 ఇళ్లకు పైగా మంజూరు చేశారని, గ్రామంలో 80% పైగా రేషన్ కార్డులు ఇచ్చారని తెలిపారు. పండితాపురం గ్రామంలో గత 50 సంవత్సరాలు క్రితం ఇండ్లు మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని, ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇండ్లు మంజూరు అయ్యాయని, తిరిగి ఈనాడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇండ్లు రేషన్ కార్డులు మంజూరు అవుతున్నాయని, పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమం కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఆలోచిస్తుందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు లాంటి ఆరు గ్యారెంటీ పథకాల అమలతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని, ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి పథకాలు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే తప్ప మిగతా పార్టీల వారు పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. గత ప్రభుత్వం లక్షల కోట్ల అప్పు చేసి పేద ప్రజల నెత్తిన భారం వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని హర్షం ప్రకటించారు. గ్రామ సభకు ముందు మల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించి, ర్యాలీతో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఘన స్వాగతం పలికారు.



ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్, షేక్ ఫతేఅహమ్మద్, మండల పార్టీ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం హనుమంతరావు, తోటకూరి శివయ్య దమ్మాలపాటి సత్యనారాయణ భానోత్ నరసింహ నాయక్, బొడ్డు లక్ష్మీనారాయణ, ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు భూక్యా నాగేంద్రబాబు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, మత్స్యశాఖ అధ్యక్షులు మేకల మల్లికార్జునరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం పుల్లయ్య, చల్ల మల్లయ్య మేకపోతుల మహేష్ బండి లక్ష్మీనర్సు బొమ్మ గాని పిచ్చయ్య కారెంగుల నాగరాజు, మొగిలి శ్రీను బత్తుల అనూష, బండి ఎల్లయ్య బాధావత్ నాగరాజు, సీఐ తిరుపతి రెడ్డి, ఎస్సై సాయికుమార్, స్పెషల్ ఆఫీసర్ వి మధు, తహసిల్దార్ సుధాకర్ సిడిపిఓ దయామణి, ఏపిఎం శ్యామ్ ఏపీవో శ్రీరాణి, పంచాయతీ కార్యదర్శి శంకర్, ఐసిడిఎస్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు

# పేదలకు ఓ న్యాయం పెద్దలకు ఓ న్యాయమా

## బడా వ్యాపారులను వదిలి పేదలపై జులుమా

## బి.ఎస్.పి చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్




మందమర్రి మార్కెట్ లో స్థలాలను కబ్జా చేసిన బడా వ్యాపారులను వదిలి చిన్నచిన్న షాపులు పెట్టుకుని వ్యాపారం చేద్దామనుకునే వారి పట్ల మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం ఏంటని బి ఎస్ పి చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు నాళాలు ఖాళీ స్థలాలను మార్కెట్ లో కబ్జా చేస్తున్నా చూసి చూడనట్టు పోతున్నారని విమర్శించారు. బడా వ్యాపారస్తుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తు, చిన్న చిన్న వ్యాపారులపై తమ ప్రతాపాన్ని చూపుతున్నారని విమర్శించారు. మందమర్రి టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కెట్ వెనకాల గల పేదల ఇళ్లను తొలగించి, ఎస్. కొండయ్య సూపర్ మార్కెట్ నుండి అజయ్ క్లాత్ స్టోర్ వరకు కాలువలు కబ్జాకు గురైన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. బడా వ్యాపారులకు రెవిన్యూ మున్సిపల్ చట్టాలు వర్తించవా అని ప్రశ్నించారు. కబ్జాకు గురైన కాలువలు, ఆక్రమణకు గురికావడానికిసిద్ధంగా ఉన్న కాళీస్తాలాలను పరిరక్షించాల్సిన బాధ్యత రెవిన్యూ, మున్సిపల్ అధికారులు దేనని కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు .

# న్యాయ వాదుల కబడ్డీ పోటీలో ' ఏ ' టీమ్ విజయం



**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:** రిపబ్లిక్ డే ను పురస్కరించుకొని న్యాయవాదుల కబడ్డీ పోటీలను కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేష్ ప్రారంభించారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఏ, బి, సి, డి టీమ్ లుగా ఏర్పడి పోటీలు జరుగగా ఫైనల్ లో డి టీమ్ పై ' ఏ ' టీమ్ విజయం సాధించింది. ఏ టీమ్ లో జి మల్లేశం, బెజ్జంకి శ్రీకాంత్, రామాంజనేయులు, గుడిపాటి సత్యం రెడ్డి బి శ్రీకాంత్ ,బలరాం నాయక్ , ఎం రజినీకాంత్ , కొత్త ప్రకాష్, లక్కం కిషోర్ చంద్ర ప్రకాష్ రెడ్డి ,షేక్ మజీద్, సిహెచ్ సురేందర్, ఈ వి కృష్ణ కే ఏ భాస్కర్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు పీవి రాజ్ కుమార్, బెతి మహేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. కబడ్డీ ఇన్చార్జి గా జి మల్లేశం వ్యవహరించారు. విజేతలను రిపబ్లిక్ డే రోజున జిల్లా జడ్జి బి ప్రతిమ బహుమతులను అందజేస్తారు.

# స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి 21 (ప్రజాబలం)**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ఆధ్వర్యంలో డాక్టర్ అంజలీనా ఆల్ఫ్రెడ్ స్కానింగ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ నిర్వహించినారు.స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు ఫామ్-ఎఫ్,ఆడిట్ ఫారములు, రికార్డులను పరిశీలించి సక్రమంగా నిర్వర్తించవలెనని,స్కానింగ్ సెంటర్లలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు కలిగియుండి రేడియాలజిస్ట్ పేర్లను సర్టిఫికెట్లలో నమోదు చేయించుకోవాలని,నిబంధనలు అనుసరించి స్కానింగ్ సెంటర్లు నిర్వర్తించవలెనని,లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడమే కాకుండా పదివేల జరిమానాలతో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించబడునని ఈ సందర్భంగా తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో డేమో రాజకుమార్,హెచ్ ఇ బాలయ్య,సి హెచ్ ఓ బాలచంద్రం,పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డిఎంహెచ్వో డాక్టర్ ఎస్ రజిత





**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి 21 (ప్రజాబలం)**రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత మండలాలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు.గంభీరావుపేట(లింగన్నపేట),పోతుగలు(ముస్తాబాద్),ఎల్లారెడ్డిపేట(బొప్పాపూర్),వీర్నపల్లి,మండలంలో నిర్మాణంలో ఉన్న భవనాలను తొందరగా పూర్తి చేయాలని భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు సూచించినారు.వీర్నపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును నూతనంగా అద్దె భవనంలో ఆరోగ్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచడం కొరకై అద్దె భవనమును పరిశీలించినారు.ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును సందర్శించి ప్రాథమిక కేంద్ర వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య కార్యక్రమాలలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమం,ఎన్సీడీలో క్యాన్సర్,రక్తపోటు,మధుమేహ నమోదు కార్యక్రమం,ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు కార్యక్రమంలపై దిశా నిర్దేశం చేసినారు.ఈకార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట వైద్యాధికారులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,డిపిఓ రాజేందర్,డి డి ఎం కార్తీక్ పాల్గొన్నారు.

# పాత బస్టాండ్ వ్యాపార సంఘం అధ్యక్షుడుగా వడ్లకొండ కనకయ్య గౌడ్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 21:**మందమర్రి పాతబస్టాండ్ లోని పద్మశాలి భవన్ లో మంగళవారం నిర్వహించిన వ్యాపార సంఘం సమావేశంలో నూతన అధ్యక్షుడిగా వడ్లకొండ కనకయ్య గౌడ్ ను సభ్యులంతా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత బస్టాండ్ వ్యాపార సంఘం అధ్యక్షుడిగా గత మూడు సంవత్సరాల నుండి వ్యాపారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కనకయ్య గౌడ్ ను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు ఎన్నికైన అంకయ్య గౌడ్ మాట్లాడుతూ తనను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న వ్యాపార సంఘం సభ్యులకు ఎప్పుడు అండగా ఉంటానని చెప్పారు. నాపై నమ్మకంతో మరోసారి బాధ్యత అప్పగించినా వ్యాపారస్థులందరికి పేరు పేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# బదిర విద్యార్థిని ఉన్నత చదువుకు ప్రభుత్వం అండ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి-21 (ప్రజాబలం)** బదిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది.ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించింది.వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన దోమకొండ లహరి తండ్రి పోచయ్య.ఈమె కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో10వ తరగతి వరకు చదివారు.ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఆర్థిక స్థోమత లేక పోవడంతో ఇంటి వద్దే ఉంటున్నారు.ఈ విషయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దృష్టిలోకి వచ్చింది.దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా,రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష 40 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం ఆర్ఎఫ్ సహాయం కింద పంపింది.మంగళవారం దోమకొండ లహరికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చెక్కు అందజేశారు.ఉన్నత విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు.తమ కూతురు చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం,సహకరించిన కలెక్టర్ కు దోమకొండ లహరి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రగతి పథంలోజమ్మికుంట 8వార్డు

## పల్లె దవఖాన ప్రజలకు అందుబాటులో

## గల్లీ సిసి,రోడ్లు డ్రైనేజీలు, ఇంటింటికి మంచినీటి సరఫరా

**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 21** జమ్మికుంట పట్టణంలోని ఎనిమిదో వార్డు ప్రగతి పథంలో దూసుకెళ్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు లో ఎటు చూసినా సిసి రోడ్లు డ్రైనేజీలు ఇంటింటికి నల్ల కలెక్షన్ తో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలకు అనువైన వార్డుగా జమ్మికుంట పట్టణంలోని 8వార్డు దర్శనమిస్తుంది. ప్రజలకు ఎలాంటి అనారోగ్యానికి గురైన కానీ పల్లె దవఖాన ఎనిమిదో వార్డులో మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తున్నారు. అలాగే ఉన్న సౌకర్యాలు మెరుగుపరచాలని ఉద్దేశంతో స్థానిక కౌన్సిలర్ పొనగంటి శ్రీలత సంపత్ ప్రత్యేక చొరవ చూపించి కోటి 50 లక్షలతో వార్డు అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టి మళ్లీ తాగునీటి సౌకర్యం కోసం కోటి రూపాయలతో వాటర్ నిర్మాణం చేపట్టారు. జమ్మికుంటలో ఉన్న 30 వార్డులకు దీటుగా అభివృద్ధిలో దూసుకు వెళ్తుందని స్థానికులు వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక కౌన్సిలర్ పొనగంటి శ్రీలత సంపత్ ను వివరణ కోరగా జమ్మికుంట మున్సిపాలిటీగా 2014 లో ఏర్పడినప్పటి నుండి కౌన్సిలర్ గా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఎప్పటికప్పుడు స్థానిక అధికారుల సహకారంతో చర్చించి నా వార్డులో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్న.ఇది 10 సంవత్సరాల కాలంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని వారు తెలిపారు. నాకు సహకరించిన అధికారులకు వార్డు ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాడని రానున్న రోజుల్లో మా వార్డులో ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ప్రజలకు అనుకూలంగా ఉండే పనులను చేపడతామని తెలిపారు.



# సింగరేణి ఎస్టీ ఎంప్లాయిస్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 21:** మందమర్రి ఏరియా జిఎం కార్యాలయంలో మంగళవారం రోజున ఏరియా జిఎం దేవేందర్ చేతుల మీదుగా ఎస్టీ ఎంప్లాయిస్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి ఉత్పత్తి, ఉత్పదకతకు భద్రతతో కూడిన ఉత్పత్తికై సహకరించాలని కంపెనీ విధించిన లక్ష్యసాధన కొరకు కృషి చేయాలని అన్నారు. ఎస్టీ ఎంప్లాయిస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధారావత్ పంతుల మాట్లాడుతూ ఎస్టీ ఉద్యోగులు అందరూ సమిష్టిగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ భూక్యా రాందాస్, ఏరియా లైజనింగ్ ఆఫీసర్ బాబు జాదవ్, మందమర్రి ఏరియా ఎస్టీ ఎంప్లాయిస్ అధ్యక్షులు తారా సింగ్, ఉపాధ్యక్షులు భూక్యా పరశు రాం, రాంబాబు మరియు ఉద్యోగులు బోడ కాసిం, శ్రీను, దేవిలాల్, అజ్మీరా రెడ్డి, అజ్మీర శంకర్, బాణావత్ జామ్లా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఆర్ జీ ఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ రవాణా సంస్థ మెంబర్ అంకతి శ్రీనివాస్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 21 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని పాత కొమ్ముగూడెంలో ఎన్ ఆర్ జీ ఎస్ నిధుల ద్వారా సంబంధించిన సీ సీ రోడ్డు నిర్మాణం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ రవాణా సంస్థ మెంబర్ అంకతి శ్రీనివాస్,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక మా ఎమ్మెల్యే ఎన్నో నిధులు తీసుకవచ్చారు అని కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజ ప్రభుత్వం అని తెలిపారు ఈ కార్యక్రమం గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుమ్మన్ని సత్యం,మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు,తీర్థల వెంకటేష్,కాంగ్రెస్ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొనడం జరిగింది.

# రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ14 వ వార్డ్ మెంబర్ చింతల సువర్ణ అశోక్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 21 :** మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మున్సిపాలిటీ 14 వార్డు లో మార్కెట్ యార్డ్ లో వార్డ్ సభ నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ మరియు వార్డ్ కౌన్సిలర్ చింత సువర్ణ అశోక్ కుమార్ కౌన్సిలర్ చింత సువర్ణ మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వార్డ్ సభను విజవంతం చేయాలనీ అలాగే రేషన్ కార్డ్ ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ ఎవరైతే అర్హులు ఉన్నారో వారి పేరు జాబితాలో రాకున్నా మరల దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈ ప్రక్రియ ఈనెల 24 తారీకు వరకు గడువు ఉంటుందని ప్రభుత్వం ప్రతి ఒక్క లబ్ధిదారునికి అర్హులకు రేషన్ కార్డ్ ఇందిరమ్మ ఇండ్లు చేకూరే విధంగా పనిచేస్తుందని ఇది ప్రజల ప్రభుత్వం అని రాష్ట్రం లో మన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఉండగా ప్రతి ఒక్క పేద ప్రజలకు లబ్ధి చేకూర్చాలని ఈ వార్డ్ సభను నిర్వహిస్తున్నమని ప్రతి పేద ప్రజలను ఆదుకునే నాయకుడు మన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అని తెలిపారు.ఈ కార్యక్రమం లో వార్డ్ ఆఫీసర్ మానస,ఆర్పీ వసంత,వార్డ్ అధ్యక్షులు ఉత్తూరి రవీందర్ లబ్ధిదారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడ దేవస్థానంలో ఆన్ లైన్ సేవలు




**రాజన్న సిరిసిల్ల జిల్లా , జనవరి -21 (ప్రజాబలం)**వేములవాడ వెళ్లే భక్తులకు గుడ్ న్యూస్...ఇంతకీ గుడ్ న్యూస్ ఏంటి అనుకుంటున్నారా? దక్షిణ కాశీగా పేరుగాంచిన (Vemulawada Sri Rajarajeshwara Swamy Devasthanam) వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన ఆన్‌లైన్ సేవలను ఆలయ అధికారులు ప్రారంభించారు. https://vemulawadatemple.telangana.gov.in, https://play.google.com/store/apps/details?idRcom.tfolio.telangana.gov&pcampaignidRweb_share వెబ్‌సైట్‌ను భక్తుల కోసం అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

ఆన్‌లైన్ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న ఆలయ కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

రాజన్న ఆలయంతో (Rajanna Temple) పాటు అనుబంధ దేవాలయాలైన, బద్ది పోచమ్మ, భీమేశ్వరాలయంతో పాటు అనుబంధ దేవాలయాల సమగ్ర సమాచారం, పూజల వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరచి ఉన్నాయి.

ఇకనుండి ఎవరైనా దేవాలయ రూమ్ లు (ధర్మశాలలు) కావాలనుకునేవారు సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్ లో ఈ టికెటింగ్ పద్ధతిన తీసుకొనగలరు, , అలాగే MEE SEVA application , MEE SEVA, తదితర మాధ్యమాల ద్వారా ఆన్లైన్ బుకింగ్ చేసుకొనవచ్చును.

# పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్దిదారుల జాబితా

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 21 :** ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసి పారదర్శకమైన లబ్దిదారుల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల శ్రీరాంపూర్ కాలనీ 5వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో నస్పూర్ మున్సిపల్ కమీషనర్ సతీష్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని అర్హత గల నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమంలో అత్యంత నిరుపేద అర్హులకు పథకం ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు.జాబితాలో వివరాలు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని,రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.గతంలో మీ-సేవ కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులు,సామాజిక, ఆర్థిక, విద్య,వైద్య,రాజకీయ, కుల గణన కార్యక్రమంలో సేకరించిన సమాచారం, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు జాబితాలో రానప్పటికీ మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు,ప్రజాపాలన సేవా కేంద్రాలలో, వార్డుసభలలో దరఖాస్తు చేసుకోవచ్చని,అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.రైతు భరోసా పథకంలో వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు,గుట్టలు, కాలనీలు,ఇండ్ల వెంచర్లు, లే-అవుట్లు,రైల్వే, నాలా భూములు,వివిధ అభివృద్ధి పథకాల కొరకు ప్రభుత్వం సేకరించిన భూములు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. వ్యవసాయ యోగ్యం గల భూమికి రైతు భరోసా ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద నిరుపేద కూలీలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించి, అర్హత మేరకు అర్హులైన లబ్దిదారులకు పథకం వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు.ఈ నెల 24వ తేదీ వరకు గ్రామపంచాయతీలలో గ్రామసభలు,మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించి అర్హులైన వారి జాబితాను చదివి వినిపించిన అనంతరం జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, గ్రామ సభ నిర్వహించే ముందు ఆయా ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తులు నిరంతర ప్రక్రియ..

## మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 21** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు నిరంతర ప్రక్రియగా ఉంటుందని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో నిర్వహించే సభలను ఆయన ప్రత్యేకంగా హాజరయ్యారు. 30 వార్డులలో ఇందిరమ్మ అర్హత జాబితా ప్లాట్ ఉన్నవారు 2507, ప్లాట్ లేని వారు 2421 వచ్చినవి. రేషన్ కార్డ్స్ 646 , ఈ రోజు 18 వార్డులలో కొత్త రేషన్ కార్డ్స్ 471 , సభ్యుల నమోదు 354 , ఇందిరమ్మ ఇండ్లు 488, మొత్తం 1313. దరఖాస్తులు వచ్చినవి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే వార్డు సభలో ప్రజలు హాజరై ఇందిరమ్మ ఇండ్లు కొత్తగా నమోదు, కొత్త రేషన్ కార్డు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చని, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా వార్డు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ అయాజ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనజర్ జి రాజిరెడ్డి,సూపర్ వైజర్స్ నరేష్,శ్రీధర్,ప్రదీప్ కుమార్, రాజశేఖర్ రెడ్డి,వాణి, భాస్కర్,వార్డ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ కు కేంద్ర సహాయం

విశాఖపట్నం విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర సహాయం చేసిందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నా రు. విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ... రాష్ట్ర అభివృద్ధి స్టీల్ ప్లాంట్ తో సాధ్యం అవుతుం దని, గత వైసిపి పాలన లో కేవలం భూ దోపిడీ కోసం మాత్రమే స్టీల్ ప్లాంట్ వ్యవహారం నడిపారని అన్నారు. 99 శాతం భోగాపురం ఎయిర్ పోర్ట్ ఎర్త్ పనులు పూర్తి అయ్యాయని,బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కు అడుగులు పడ్డాయని, ఐదేళ్ల క్రితం జగన్ ప్రభుత్వం విశాఖలో భూములు కాజేశారని, దసపల్లా, వాల్తేరు క్లబ్ భూములు కూడా దోచుకునేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. స్టీల్ ప్లాంట్ లో పునరుత్తేజం తెచ్చింది చంద్రబాబు అని పల్లా శ్రీనివాసరావు చెప్పారు.కేంద్రాన్ని ఒప్పించి నిదులు రాబట్టారని,ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పుడు 11400 కొట్లు ఇచ్చి కాపాడింది చంద్రబాబు అని అన్నారు.

# మానవ, బాలల హక్కుల చట్టాలపై అవగాహన

మైలవరం, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఎస్. లిల్లెమ్మ ఆధ్వర్యంలో మానవ హక్కులు, బాలల హక్కుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కులు, అదేవిధంగా బాలల హక్కులపై ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో మానవులకు ఉన్న చట్టపరమైన హక్కులు ఏమిటి? అదేవిధంగా బాలలకు ఉన్న చట్టపరమైన హక్కులు ఏమిటి? అనే అంశాలపై లిల్లెమ్మ విద్యార్థిని విద్యార్థులకు స్పష్టంగా వివరించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com